ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 132 | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు




## ప్రజా ప్రతినిధుల పనితీరే
# ప్రామాణికం

- ప్రధాన ఇండికేటర్ల ఆధారంగా 175 నియోజకవర్గాలకూ గ్రేడింగ్..
- 93శాతం మార్కులతో విజయవాడ పశ్చిమం తొలిస్థానం..
- అభివృద్ధి, సంక్షేమం సేవల అమలుపై సమగ్ర అంచనా..
- వేసవి నీటి ఎద్దడిపై ముందస్తు కార్యాచరణకు ఆదేశాలు..
- క్షేత్రస్థాయిలో పాలసీల అమలుతోనే ఫలితాలు.. సిఎం.

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా పనితీరు ఆధారంగా ర్యాంకులను ప్రకటిస్తూ పాలనలో స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. ప్రధాన ఇండికేటర్లను ప్రామాణికంగా తీసుకుని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, పాలనా సామర్థ్యం వంటి అంశాలపై సమగ్రంగా అంచనా వేసి ఈ ర్యాంకులను ఖరారు చేశారు. కూటమి ఎమ్మెల్యేలు 164 నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గం పనితీరు స్పష్టంగా కనిపించేలా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.అధికారుల సమక్షంలో ర్యాంకులను వెల్లడించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ ప్రక్రియ ఉద్దేశ్యం లోపాలను ఎత్తిచూపడం కాదని, పాలనను మరింత సమర్థవంతంగా మార్చడమేనని స్పష్టం చేశారు. ఏ నియోజకవర్గం ఏ అంశంలో బాగా పనిచేస్తోంది, ఎక్కడ మెరుగుదల అవసరమో తెలుసుకునేందుకు ఈ ర్యాంకులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, (మిగతా 2లో)

## దేవుడినే అడ్డు పెట్టుకుని అబద్ధాలు.. కుట్రలు
## చంద్రబాబువి దిగజారుడు
# రాజకీయాలు

- తిరుమల పవిత్రపై దుష్ప్రచారం..
- హిందువుల్లో జగన్‌పై ద్వేషం పెంచే యత్నం..
- బోలేబాబా సంస్థకు అనుమతి ఇచ్చింది మీ ప్రభుత్వమే..
- 82వేల కిలోల నెయ్యి కొనుగోలుకు ఒక్కరోజే అనుమతి ఎలా ఇచ్చారు..
- సీబిఐ దర్యాప్తు తర్వాత ఏకసభ్య కమీషన్ ఎందుకు.. రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి..



**కడప (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవుడినే అడ్డుపెట్టుకుని కుట్రపూరితంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. బరితెగించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం చంద్రబాబు అలవాటుగా మారిందని, ప్రతిరోజూ ఆయన చెప్పే అబద్ధాలను ఖండించకపోతే అవి ప్రపంచం మొత్తం తిరుగుతున్నాయని అన్నారు. అందుకే (మిగతా 2లో)

## మాతా శిశు ఆరోగ్యానికి
# పెద్ద పీట

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

'సంజీవని' ద్వారా జులై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేర్ అండ్ గ్రో ద్వారా మాతాశిశు ఆరోగ్యం, పెరుగుదల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. జనాభా నిర్వహణ, సంజీవని ప్రాజెక్టు, పౌష్టికాహారంపై సోమవారం సీఎం చంద్రబాబు సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మాతాశిశువులకు పౌష్టికాహారంతోపాటు సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం, అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందేలా చూడాలి. సాధారణ ప్రసవాలు పెరిగేలా, సిజేరియన్లు తగ్గేలా చూడాలి. 60 ఏళ్లు దాటితే ఏ పనీ చేయలేమన్న సైకాలజీని ప్రజల్లో మార్చాలి. వివిధ వర్గాలతో అధికారులు మాట్లాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్ర కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం.జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరిగింది. యూరప్‌లోని 20 దేశాల్లో ఏజింగ్ సమస్యతో సామాజిక వేడుకలు లేవు. ఏపీలో మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకొస్తాం. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి. పరీక్షలంటే విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## అంబటికి
# బెయిల్

పలు కేసుల్లో మాజీ మంత్రికి ఊరట




## తిరుమల లడ్డూ విక్రయాల్లో
# సంస్కరణలకు నాంది


ప్రతి కౌంటర్ వద్ద యూపిఐ పేమెంట్..
భక్తులకు సులభంగా శ్రీవారి ప్రసాదం అందించేందుకు టిటిడి కీలక నిర్ణయాలు



**తిరుమల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

తిరుమలలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతంగా లడ్డూలు అందించాలనే లక్ష్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు విక్రయాలపై సంస్కరణాత్మక నిర్ణయాలకు శ్రీకారం చుట్టింది. భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో లడ్డు విక్రయ కేంద్రాల్లో ఏర్పడుతున్న రద్దీని నియంత్రించి, భక్తుల సమయాన్ని ఆదా చేసే దిశగా టీటీడీ కీలక చర్యలు చేపడుతోంది.ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా (మిగతా 2లో)

# పోలవరం నిధుల కోసం ఢిల్లీకి సిఎం



- 2027 గోదావరి పుష్కరాలకంటే ముందే పూర్తి లక్ష్యం..
- పెండింగ్ బకాయిల విడుదలపై కేంద్రంపై ఒత్తిడి..
- కేంద్ర జలశక్తిమంత్రి సీఆర్ పాటిల్‌తో కీలక భేటీ..
- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాజెక్టు నష్టానికి కారణం..
- పోలవరం జాతికి అంకితం చేయడమే ప్రభుత్వ అజెండా..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

రాష్ట్ర జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక అడుగు వేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదల, పునరావాసం, పునర్నిర్మాణం (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీల నిధులు, అలాగే ప్రాజెక్టు పనులకు అవసరమైన కేంద్ర అనుమతుల కోసం సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ పర్యటనలో కేంద్ర ప్రభుత్వంపై రాజకీయంగా, పరిపాలనా పరంగా ఒత్తిడి పెంచే వ్యూహంతో సీఎం ముందుకు సాగుతున్నారు. పోలవరం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చంద్రబాబు, 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లక్ష్య సాధనకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతులు కీలకంగా (మిగతా 2లో)

# హాస్టళ్ల తీరు అధ్వాన్నం

- వైకాపా హయాంలో రూ.7,245 కోట్లు ఖర్చు ..
- చంద్రబాబు కేవలం రూ.455 కోట్లే ఖర్చు చేశారు..
- హాస్టళ్లలో దారుణ పరిస్థితులు ఉన్నా పట్టించుకోరా..
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వైకాపా నేత టిజెఆర్ సుధాకర్




**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

వైఎస్ జగన్ హయాంలో హాస్టల్స్ ఎలా ఉన్నాయో చంద్రబాబు చూసి తెలుసుకోవాలని వైసిపి నేత టిజెఆర్ సుధాకర్ అన్నారు. జగన్ హయాంలో హాస్టల్స్ కు రూ.7,245 కోట్లు ఖర్చు చేశారు. 2014-19 మధ్యలో చంద్రబాబు కేవలం రూ.455 కోట్లే ఖర్చు చేశారు. దాన్నిబట్టే సంక్షేమ హాస్టల్‌లో ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ ప్రతిరోజూ మంచి భోజనం (మిగతా 2లో)

## అభివృద్ధి - సంక్షేమంపై
# రాజీ పడే ప్రసక్తే లేదు

- పథకాల అమలులో అలసత్వం వద్దు..
- ఖజానా నుంచి ఖర్చయ్యే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి..
- ప్రతి పథకం అర్థవంతంగా పేదలకు చేరాలి..
- గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ప్రత్యేక దృష్టి..
- పారదర్శకతతో, నిబద్ధతతో సమిష్టిగా పనిచేయాలి.. పవన్ కళ్యాన్



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

క్షేత్రస్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించ వద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని చెప్పారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ పాల్గొని మాట్లాడారు. తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని పవన్ అన్నారు. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు. అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవితల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వివిధ పథకాలకు రూ.11,328 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌కు రూ.25వేల కోట్ల మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.10వేల కోట్ల పనులు ప్రారంభ మయ్యాయని పవన్ తెలిపారు. ఉన్న తక్కువ వనరులను ఉపయోగించుకొని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని సహాయ సహకారాలు, ముఖ్యమంత్రి అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని వెల్లడించారు. ప్రతి రూపాయి క్షేత్రస్థాయిలో కనిపించాలని... ప్రాజెక్టులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉదాసీనత ఉంటుందన్నారు డిప్యూటీ సీఎం. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావలంటే చాలా వరకూ ఎక్స్క్యూజెస్ కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి, తాను అకౌంటబిలిటీ ఫిక్స్ చేసుకుంటున్నామని.. అందుకే క్షేత్ర స్థాయిలో ఫలితాలు రావాలని కోరుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధి రేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధన కోసం పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల పురోగతిపై సమీక్షించారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణపై వివరించారు.

## అసెంబ్లీ సమావేశాలు విద్యార్థులు
# వీక్షించేలా ఏర్పాట్లు

ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా విద్యాసంస్థలు సంప్రదించాలి.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు.. అసెంబ్లీ సమావేశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా అసెంబ్లీ సభలో వీక్షించుకునే అవకాశం కల్పించనున్నారు. అసెంబ్లీ జరిగే ప్రతి రోజు విద్యార్థులు సభ సమావేశాలను ప్రత్యక్షంగా చూడగలుగుతారు. చట్టసభల పట్ల విద్యార్థులలో అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నారు.. ఇందుకు సంబంధించి స్కూల్స్, కాలేజీలు (మిగతా 2లో)

## వైభవ్ సూర్యవంశీని
# టీమిండియాలోకి
## తీసుకోండి
### కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్




**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడించాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్ చేశాడు. అద్వితీయమైన ప్రదర్శనతో అదరగొడుతున్న ఈ 14 ఏళ్ల కుర్రాడిని వీలైనంత త్వరగా భారత సీనియర్ జట్టులోకి తీసుకోవాలని ట్వీట్ చేశాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ భారీ శతకంతో చెలరేగిన సంగతి తెలిసిందే.80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ గెలుచుకున్నాడు. 15 సిక్స్‌లు, 15 ఫోర్లతోనే 150 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తోంది. వెంటనే వైభవ్ సూర్యవంశీని భారత జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా సోషల్ మీడియా వేదికగా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'వైభవ్ సూర్యవంశీని వీలైనంత త్వరగా ఉన్నత స్థాయి క్రికెట్‌లోకి తీసుకురావాల్సిన (మిగతా 2లో)

# ప్రజా ప్రతినిధుల పనితీరే ప్రామాణికం



(మొదటి పేజీ (తరువాయి)

అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ గ్రేడ్‌లో నిలవగా, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడ్‌లో, ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌లో నిలిచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 90 శాతానికి పైగా మార్కులు సాధించి ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన నియోజకవర్గాలు 13 ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ గణాంకాలు రాష్ట్రవ్యాప్తంగా పనితీరు స్థాయిని ప్రతిబింబిస్తున్నాయని సీఎం వ్యాఖ్యానించారు.93 శాతం మార్కులతో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానాన్ని ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సాధించింది. ఈ నియోజకవర్గానికి సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 92 శాతం మార్కులతో విశాఖపట్నంలోని గాజువాక నియోజకవర్గం రెండో స్థానంలో నిలవగా, కాకినాడ నగర నియోజకవర్గం మూడో ర్యాంకు, విజయవాడ తూర్పు నియోజకవర్గం నాలుగో ర్యాంకు సాధించినట్లు అధికారులు వెల్లడించారు. టాప్ ర్యాంకులు సాధించిన నియోజకవర్గాలు మిగిలిన వాటికి ఆదర్శంగా నిలవాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు కీలక అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యతలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్న దానిపై లోతైన చర్చ జరిపారు. పాలనలో ఫలితాలే అసలైన కొలమానం అని, ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా నిర్ణయాలు అమలవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వలపై సమీక్ష జరిపి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. పశువుల దాణా, నీటి అవసరాలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీఎం పేర్కొన్నారు.అలాగే ప్రజాసమస్యలు, పాలనా తీరు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫైల్‌స్థాయిలో తీసుకునే నిర్ణయాలు కాగితాలకే పరిమితం కాకుండా భూమి స్థాయిలో సమర్థవంతంగా అమలైనప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# హాస్టళ్ల తీరు అధ్వాన్నం

(మొదటి పేజీ (తరువాయి)

ఎట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టీజేఆర్.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. చంద్రబాబు ఎంతసేపూ పబ్లిసిటీ చేసుకోవటమే తప్ప విద్యార్థులకు ఏం న్యాయం చేశారు?, హోంమంత్రి అనిత హాస్టల్‌లో తిన్న భోజనంలోనే బొద్దింక వచ్చినా పద్ధతి మార్చు కోలేదు. ఇప్పటికి 18 సంఘటనల్లో వేలాది మంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థుల అవస్థలను పట్టించుకోరా?, పోలవరం జిల్లాలో 89 మంది అస్వస్థత పాలయితే ప్రభుత్వం ఏం చేస్తోంది?, విద్యార్థుల అవస్థలు మీ హైటెక్ ప్రభుత్వానికి తెలియదా లేదా?, గిరిజనులు, దళితులంటే ఎందుకంత కక్ష అంటూ విమర్శలు గుప్పించారు. అన్ని రకాల వస్తువులూ ధరలు విపరీతంగా పెరిగి జనం అవస్థలు పడుతున్నారు. కానీ అభివృద్ధి, సంక్షేమం అద్భుతమని చంద్రబాబు తనకు తానే చెప్పుకుంటున్నారు. మీ పాలన ఎలా ఉందో కూటమి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డే తేల్చి చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను చంద్రబాబు అమ్మేయాలపోతే జగన్ అడ్డుకున్నారు. ఇప్పటికీ అక్కడి ఉద్యోగులు భయంగానే బతుకుతున్నారు. అమరావతిలో రైతులను నిలువునా మోసం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం తప్ప రాజధానిలో ఏం జరుగుతోంది?, చంద్రబాబు చీకటి ఎత్తుగడలకు రైతులు అన్యాయం అవుతున్నారు. రూ.76 వేల కోట్లు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపుతున్నా నిర్మాణాలు మాత్రం కనపడటం లేదన్నారు. రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లు ఎప్పుడు ఇస్తారు?, ఏఐ టెక్నాలజీ అని చెప్పి మరి ఆ మేరకు పాఠ్యపుస్తకాలను ఎందుకు రూపొందించ లేదు?, టెక్నాలజీ ఉండాలిగాని మితి మీరిన టెక్నాలజీ అవసరం లేదు. ముందు ఆకలితో ఉన్న వాడికి తిండి పెట్టండి. 23 లక్షల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో చంద్రబాబు చెప్పాలి. చంద్రబాబు అవుట్‌డేటెడ్ సీఎం. ఆయన ఆలోచనలు మారాలి. హెరిటేజ్ పెరుగు నాసిరకం అని ల్యాబులు నిర్ధారించాయి. సబ్ స్టాండర్డ్ అని తేల్చి చెప్పాయి. నాసిరకం పెరుగు విక్రయించినందుకు హెరిటేజ్ సంస్థ పెనాల్టీ కట్టింది. ఇలాంటి పనులు చేసినందుకు చంద్రబాబు సిగ్గు పడాలని మండిపడ్డారు.

# వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకోండి

(మొదటి పేజీ (తరువాయి)

అవసరం ఉంది. గతంలో మనం క్రీజులో 14 ఏళ్ల మేధావిని చూశాం. ఆయన పేరు సచిన్ టెండూల్కర్. ఆ సమయంలో మనం ఆయన ఎంతో కాలం వేచి ఉండలేదు.' అని ఒక కమ్యూనిటీ ప్రకటనలో వైభవ్ సూర్యవంశీ ఫోటోను షేర్ చేశాడు. సచిన్ తరహాలోనే వైభవ్ సూర్యవంశీకి అవకాశాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. సచిన్ టెండూల్కర్ తన 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. 1973లో పుట్టిన సచిన్.. 16 ఏళ్ల వయసులోనే 1989 పాకిస్తాన్ పర్యటనకు ఎంపికయ్యాడు. సాధారణంగా ఆ వయసు ఆటగాళ్లు ఏజ్ క్రికెట్ ఆడుతారు. కానీ సచిన్‌లోని అపార ప్రతిభను గుర్తించిన నాటి సెలెక్టర్లు వయసుతో సంబంధం లేకుండా జట్టులోకి తీసుకున్నారు. స్కూల్, ఏజ్ క్రికెట్‌లో సచిన్ పరుగుల మోత మోగించాడు. స్కూల్ స్థాయిలో తన సహచర ఆటగాడైన వినోద్ కాంబ్లితో కలిసి సచిన్ నెలకొల్పిన భాగస్వామ్యం ప్రపంచ రికార్డ్. రంజీ క్రికెట్‌లో నిలకడగా రాణించడంతో పాటు బ్యాటింగ్‌లో టెక్నిక్, ఫియర్‌లెస్ గేమ్ సెలెక్టర్లను ఆకట్టుకుంది. సచిన్‌ను భారత జట్టులోకి తీసుకోవడం అప్పట్లో సాహసోపేతమైన నిర్ణయమే.ఐసీసీ రూల్స్ ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు కనీస వయసు 15 ఏళు నిండి ఉండాలి. ఒకవేళ ఏదైనా దేశం 15 ఏళ్ల లోపు ఆటగాడిని ఆడించాలి అనుకుంటే, ఐసీసీకి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ ఆటగాడి మానసిక, శారీరక దృఢత్వాన్ని పరిశీలించిన తర్వాతే ఐసీసీ అనుమతి ఇస్తుంది. ఈ నిబంధనను ఐసీసీ 2020లో ప్రవేశపెట్టింది. ఆటగాళ్ల భద్రత, మానసిక పరిపక్వతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత వయస్సు కేవలం 14 ఏళ్లు మాత్రమే. ఐసీసీ నిబంధన ప్రకారం అతను 15 ఏళ్లు నిండిన తర్వాతే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. వైభవ్‌ను సచిన్ టెండూల్కర్‌తో పోల్చినప్పటికీ, ప్రస్తుత కాలంలో పోటీ చాలా ఎక్కువగా ఉంది. దేశవాళీ క్రికెట్‌లో (రంజీ ట్రోఫీ వంటివి) వైభవ్ సూర్యవంశీ మరింత నిలకడగా రాణించి, తన శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. బీసీసీఐ యువ ఆటగాళ్లను నేరుగా జాతీయ జట్టులోకి తీసుకోకుండా.. ముందుగా అండర్-19, భారత్-ఎ జట్ల ద్వారా రాటుదేలేలా చేస్తుంది. ఆ తర్వాతే అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడిస్తోంది.

# చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

(మొదటి పేజీ (తరువాయి)

తిరుమల పవిత్రత అంశంపై రోజా మాట్లాడాల్సి వస్తోందని స్పష్టం చేశారు.మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కేవలం హిందువుల్లో వైఎస్ జగన్‌పై వ్యతిరేకత పెంచాలనే ఉద్దేశంతో దుష్ప్రచారానికి దిగారని విమర్శించారు. దేవుడినే అడ్డుపెట్టుకుని కుట్రలకు తెరలేపడం అత్యంత దుర్మార్గమని అన్నారు. జంతు కొవ్వు కలిసిందని మొదటిసారి అబద్ధం చెప్పారని, నిజంగా స్వామివారి పవిత్రతపై చిత్తశుద్ధి ఉంటే ఈ విషయాన్ని బహిరంగంగా మాట్లాడే అవసరం లేదన్నారు. గోప్యంగా విచారణ చేసి నిజాలు తేలిన తర్వాతే ప్రకటన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనల సమయంలో న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు వింటే వాస్తవాలు అర్థమవుతాయని తెలిపారు. ఆనాడు సుప్రీంకోర్టు మందలించినా చంద్రబాబుకు బుద్ధి రాలేదని విమర్శించారు. సీబీఐ విచారణ జరిగినప్పటికీ దర్యాప్తు చేసింది మీ అధికారులేనని, వారి రిపోర్టుల్లో జంతు కొవ్వు కలవలేదని స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. అప్పుడైనా స్వామివారిని క్షమాపణ కోరాల్సింది పోయి హితవు పలికారు.అప్పుడు జంతు కొవ్వు అన్నారని, ఇప్పుడు బాత్రూం శుభ్రం చేసే పదార్థాలు వాడారంటూ కొత్త కథలు చెబుతున్నారని మండిపడ్డారు. భోలేబాబా సంస్థకు అనుమతి ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వమే కాదా అని ప్రశ్నించారు. 82 వేల కేజీల నెయ్యి కొనుగోలుకు ఒకే రోజులో అనుమతి ఇచ్చిన విషయం ఎవరి హయాంలో జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. భోలేబాబా సంస్థ ఫ్రాడ్ అని తెలిసినా అంత పెద్ద మొత్తంలో నెయ్యికి ఎలా ఆర్డర్ ఇచ్చారని ప్రశ్నించారు.సీబీఐ రిపోర్ట్ నచ్చకపోతే దాని తర్వాత ఏకసభ్య కమిషన్ ఎలా వేస్తారని నిలదీశారు. ఎన్డీడీబీ, ఎన్డీఆర్‌బి ల్యాబ్ రిపోర్టులు కూడా సరిపోవని చంద్రబాబు ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. అంతరాత్మ సాక్షిగా ప్రమాణం చేస్తానని చెప్పే నైతిక హక్కు ఆయనకు ఎక్కడుందని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో నెయ్యి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని స్పష్టం చేశారు. సీబీఐ, సిట్, ల్యాబ్ రిపోర్టులు అన్నీ చెప్పినా నారా వారి మాటే నిజమని ప్రజలు నమ్మాలని కోరుకోవడం అహంకారానికి నిదర్శనమని అన్నారు. పాలే లేకుండా పెరుగు తయారు చేసినందుకు చంద్రబాబు హెరిటేజ్ సంస్థ లక్ష రూపాయల జరిమానా చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ వ్యవహారానికి ఫుల్ స్టాప్ పడాలంటే ఒక్కటే మార్గమని, దేవదేవుడైన వెంకటేశ్వర స్వామి నిజాన్ని నిరూపిస్తారని వ్యాఖ్యానించారు.జంతు కొవ్వు కలిపితే తమ చేతులు పడిపోవాలని, కలపకపోతే చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ నోరు పడిపోవాలని అన్నారు. స్వామివారి శిక్ష తప్పకుండా ఉంటుందని హెచ్చరించారు. చంద్రబాబు చేసిన అపచారానికి కచ్చితంగా శిక్ష పడుతుందని, 2029 తర్వాత చంద్రబాబు గానీ ఆయన కుమారుడు గానీ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు స్వామివారి పట్ల భక్తి లేదని, ప్రజల మనోభావాలపై గౌరవం లేదని రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

# అంబటి రాంబాబుకు బెయిల్

**గుంటూరు (తెలుగోడు) ఫిబ్రవరి 9 :**

వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మంజూరైంది. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఇటీవలే అరెస్టైన అంబటికి బెయిల్ మంజూరు చేసింది గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు. అంబటి బెయిల్ పిటిషన్ పై సోమవారం విచారణ చేపట్టిన కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో కస్టడీ పిటిషన్ ను డిస్మిస్ చేసింది కోర్టు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి బెయిల్ మంజూరయ్యింది. ఈ కేసుకి సంబంధించి అంబటిని జనవరి 31న అరెస్ట్ చేశారు పోలీసులు. ప్రస్తుతం రాజమండ్రి జైలుకు రిమాండ్ ఖైదీగా ఉన్నారు అంబటి రాంబాబు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్ ను డిస్మిస్ చేసింది కోర్టు. అయితే.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ర్యాలీ కేసులో కూడా అంబటికి రిమాండ్ విధించింది కోర్టు. ఈ కేసులో కూడా బెయిల్ రావడంతో ఈ క్రమంలో అంబటి రిలీజ్ పై వున్న అనుమానాలు నివృతి అయ్యాయి..సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఆయనను శనివారం జనవరి 31 అరెస్ట్ చేశారు పోలీసులు. ఆదివారం ఫిబ్రవరి 1 అంబటి రాంబాబును గుంటూరు ప్రత్యేక సివిల్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించింది కోర్టు. జనవరి 31న వైసీపీ చేపట్టిన పాప ప్రక్షాళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంబటి కర్రలతో, రాళ్లతో వచ్చి కారును అడ్డుకొని దుర్భాషలాడారు. టీడీపీ కార్యకర్తలు.. ఈ క్రమంలో సహనం కోల్పోయిన అంబటి టీడీపీ కార్యకర్తలు, సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 1న చుట్టు నల్లపాడు పోలీసులు అంబటి రాంబాబును అరెస్ట్ చేశారు. సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, దీంతో లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తాయనే ఆరోపణల కింద కేసు నమోదైంది. ఫిబ్రవరి 2న గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు అంబటి రాంబాబుకి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించి, ఆయనను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించింది. ఆయన వయసు, ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అంతేకాదు, ఈ కేసులో కస్టడీ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ప్రస్తుతం అంబటి రాంబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ మంజూరైనప్పటికీ, ఇతర కేసుల్లో రిమాండ్ కొనసాగుతోంది. గత నవంబర్ 12న పెట్టిన ఒక కేసులో ఈ నెల 22 వరకు రిమాండ్ పొడిగించిన సంగతి తెలిసిందే. అంబటి మీద మొత్తం 36కి పైగా కేసులు గుంటూరు, ఈస్ట్ గోదావరి, బాపట్ల, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో ఉన్నాయి. ఇలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసులు క్వాష్ చేయాలని దాఖలైన పిటిషన్‌ను కోర్టు ఫిబ్రవరి 11కి వాయిదా వేసింది.

# తిరుమల లడ్డూ విక్రయాల్లో సంస్కరణలు

(మొదటి పేజీ (తరువాయి)

ఉన్నప్పటికీ, పరీక్షలు ముగిసిన అనంతరం వేసవి సెలవుల్లో రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా లడ్డు విక్రయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే రద్దీ వేళల్లో క్యూ లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.లడ్డు విక్రయ కేంద్రాల్లో ఇప్పటివరకు ప్రధానంగా నగదు చెల్లింపుల ద్వారానే లడ్డూలు విక్రయిస్తున్నారు. అయితే ఇటీవల యూపీఐ పేమెంట్లు వినియోగించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగా లడ్డు విక్రయ కేంద్రంలోని ప్రతి కౌంటర్ వద్ద యూపీఐ పేమెంట్‌కు అవకాశం కల్పించనుంది. దీని ద్వారా భక్తులు నగదు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా, సులభంగా డిజిటల్ చెల్లింపులు చేసి లడ్డూలు పొందవచ్చు.శ్రీవారి ఆలయం వెనుకభాగంలోని లడ్డు విక్రయ కేంద్రంలో గత ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చిన కియోస్క్ యంత్రాల ద్వారా యూపీఐ చెల్లింపు సౌకర్యం కల్పించారు. కావాల్సిన లడ్డూల సంఖ్యను ఎంపిక చేసి యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తే వచ్చే రశీదు ఆధారంగా కౌంటర్‌లో లడ్డూలు పొందే విధానం అమలులో ఉంది. అయితే ఈ యంత్రాల వద్ద ఇటీవల అధిక రద్దీ ఏర్పడటం, సాంకేతిక లోపాలు తలెత్తడం, పేమెంట్ అనంతరం కూడా మళ్లీ క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.ఈ సమస్యలను పరిష్కరించేందుకు లడ్డు విక్రయ కౌంటర్ల వద్దనే యూపీఐ క్యూఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలని టీటీడీ అధికారులు యోచిస్తున్నారు. దీంతో భక్తులు నేరుగా కౌంటర్ వద్దే డిజిటల్ చెల్లింపులు చేసి వెంటనే లడ్డూలు పొందే అవకాశం ఉంటుంది. రద్దీ తగ్గడంతో పాటు లడ్డు విక్రయాలు మరింత సాఫీగా సాగనున్నాయని టీటీడీ భావిస్తోంది. శ్రీవారి ప్రసాదాన్ని భక్తులకు మరింత సులభంగా, భక్తి భావంతో అందించాలనే ఉద్దేశంతో తీసుకుంటున్న ఈ సంస్కరణలు భక్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ఏపీ భవిష్యత్తుపై దేశ రాజధానిలో చర్చలు

**న్యూ ఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 9 :**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన రాష్ట్ర రాజకీయాలు, పాలన పరంగా కీలకంగా మారుతోంది. ఒకవైపు పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతుండగా, మరోవైపు ఏపీలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సమీపిస్తున్న వేళ ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న అనూహ్య రాజకీయ పరిణామాలు, లడ్డూ వివాదం పతాక స్థాయికి చేరుకోవడం, సిట్ ఛార్జ్ షీట్ నేపథ్యంలో పరిస్థితి మరింత సున్నితంగా మారిన సమయంలో చంద్రబాబు ఢిల్లీ టూర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం భేటీ కానుండటం రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను పెంచుతోంది. పాలనా పరమైన అంశాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై కూడా కీలక చర్చ జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రాత్రికి ఢిల్లీ చేరుకోనుండగా, రేపు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుగురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహించనున్నారు. కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌లతో సీఎం సమావేశాలు జరగనున్నాయి. ఈ భేటీల్లో రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు అంశాలపై చంద్రబాబు విస్తృతంగా చర్చించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కేంద్రంలోని పలు శాఖల నుంచి ఏపీకి గరిష్టంగా నిధులు సాధించడంపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి సిద్ధం చేసిన ప్రతిపాదనలతో కేంద్ర మంత్రులను కలవనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ వివాదాలు, లడ్డూ వ్యవహారంలో సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్, వాటిపై వచ్చిన తాజా పరిణామాలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం చర్చించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు కేంద్ర మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో విస్తృత ప్రచారం కొనసాగుతోంది. ఏపీకి మరో మంత్రి పదవి దక్కే అవకాశాలపై చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో కూటమి పార్టీల నుంచి ఎవరికీ అవకాశం కల్పించాలన్న అంశం కూడా భేటీల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. అంతేకాకుండా కేంద్రంలోని నామినేటెడ్ పదవుల్లో ఏపీ మిత్రపక్షాలకు అవకాశం ఇవ్వాలన్న బీజేపీ నిర్ణయం నేపథ్యంలో, ఆ అంశాలపైనా చర్చించి స్పష్టత తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద రాజకీయ, పాలనా పరమైన కీలక పరిణామాల మధ్య చంద్రబాబు ఢిల్లీ పర్యటన రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలకు దారి తీసే అవకాశముందని భావిస్తున్నారు.

# పోలవరం నిధులకోసం సీఎం ఢిల్లీకి

(మొదటి పేజీ (తరువాయి)

ఉండటంతో ఢిల్లీలో జరిగే చర్చలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగే భేటీలో పోలవరం నిధుల విడుదలపై స్పష్టమైన హామీ తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు.పోలవరం విషయంలో గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే నేటి సమస్యలకు కారణమని సీఎం చంద్రబాబు మరోసారి విమర్శించారు. 480 కోట్ల రూపాయలతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌ను కాపాడుకోలేక ప్రాజెక్టును నాశనం చేశారని ఆరోపించారు. ఆ తప్పిదాలను సరిదిద్దేందుకు ఇప్పుడు దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో మళ్లీ నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ ప్రాజెక్టును మధ్యలో వదిలిపెట్టేది లేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని తేల్చి చెప్పారు.ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు పనులు దాదాపు 93 శాతానికి పైగా పూర్తయ్యాయని ప్రభుత్వం వెల్లడించింది. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. 2026 జూన్ నాటికి కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తవుతుందని నిర్మాణ సంస్థ ప్రకటించడంతో, ఆ వెంటనే మిగతా పనుల్ని పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.పోలవరం పూర్తైతే రాష్ట్ర వ్యవసాయ రంగానికి, తాగునీటి అవసరాలకు, విద్యుత్ ఉత్పత్తికి, పరిశ్రమల అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకే పోలవరం ప్రాజెక్టును కేవలం ఒక నిర్మాణంగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడ్డ అంశంగా ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. కేంద్ర సహకారం ఉంటే మరింత వేగంగా పనులు పూర్తవుతాయని, లేకపోతే రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతామని ప్రభుత్వ వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి.ఎన్ని రాజకీయ అడ్డంకులు ఎదురైనా, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు వచ్చినా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయడమే తమ ప్రభుత్వ ముందున్న ఏకైక లక్ష్యమని ఏపీ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ సంకల్పంతోనే సీఎం చంద్రబాబు పోలవరం నిధుల కోసం ఢిల్లీ వెళ్లి కీలక చర్చలకు సిద్ధమయ్యారు.

# విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు

(మొదటి పేజీ (తరువాయి)

తమ విద్యార్థులను తరలించేందుకు ముందుగా అసెంబ్లీ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని సూచించారు.. అసెంబ్లీ సమావేశాలను టీవీల్లో చూడడం కాదు.. అసెంబ్లీకి వెళ్లి.. ప్రత్యక్షంగా మన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు.. ప్రతిపక్ష నేతలు ఎక్కడ కూర్చుంటారు.. స్పీకర్ ఎటువైపు ఉంటారు? అసెంబ్లీలో సెక్యూరిటీ ఏంటి? అక్కడ ఉండే ఇతర సదుపాయాలు ఏంటని ప్రత్యక్షంగా చూడడం.. తెలుసుకోవడం ఎవరికైనా ఇష్టమే.. అలాంటి అవకాశం విద్యార్థులకే వస్తే.. ఎగిరి గంతేస్తారు.. అందుకే ఈ అవకాశం కల్పించాలని స్పీకర్ నిర్ణయించారు. అయితే, బ్జడెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులు.. 45 నిమిషాల పాటు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంటుందని వెల్లడించారు.. వివరాల కోసం ఆసక్తి ఉన్న స్కూల్/కాలేజీలు 0863-2449184, 0863-2449185 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు..


# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

**న్యూ ఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 9 :**

బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' పక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ పక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ పక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది.

# బృంగి వాహనంపైశివపార్వతుల విహారం


## భక్తి పారవశంలో పులకించిన శ్రీశైలం పురవీధులు... మారు మ్రోగిన శివనామ స్మరణ



**శ్రీశైలం (తెలుగోడు) ఫిబ్రవరి 9 :**

దక్షిణ భారతదేశంలోనే అత్యంత పవిత్రమైన శైవ క్షేత్రంగా ఖ్యాతి గాంచిన శ్రీశైల మహా క్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తి వైభవంతో ఉట్టిపడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం శివపార్వతులు బృంగి వాహనంపై విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్ల అలౌకిక దర్శనంతో ఆలయ ప్రాంగణం నుంచి శ్రీశైలం పురవీధుల వరకు భక్తి పారవశం వెల్లివిరిసింది.ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి అమ్మవార్ల యాగశాలలో అర్చక స్వాములు ఆగమ శాస్త్రానుసారంగా విశేష పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ హోమ హవనాలు, అభిషేకాలు ఘనంగా సాగాయి. శివపార్వతుల కృప ఫలించాలని భక్తులు ప్రత్యేక సంకల్పాలు తీసుకొని పూజల్లో పాల్గొన్నారు.సాయంత్రం అక్కమహాదేవి అలంకరణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలు, ఆభరణాలు, అరుదైన పూలతో శోభాయమానంగా అలంకరించారు. పుష్పాల పరిమళంతో మండపం దివ్య ధామంలా మారింది. అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా అలంకరణ పూజలు నిర్వహించి, మహా మంగళహారతులు సమర్పించారు.అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ రాజగోపురం గుండా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవం శ్రీశైలం పురవీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. భక్తుల జయజయధ్వానాలతో, శివ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.గ్రామోత్సవంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకారుల విన్యాసాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల మోత, మేళతాళాల నాదం, గురవాయా నృత్యాల లయ భక్తుల మనసులను కట్టిపడేశాయి. కళాకారుల ప్రదర్శనలు ఉత్సవ వైభవాన్ని





రెట్టింపు చేశాయి.స్వామి అమ్మవార్ల ఉద్యమూర్తులను దర్శించిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. కొందరు భక్తులు కన్నీటి పర్యంతమై తమ భక్తి భావాన్ని వ్యక్తం చేయడం విశేషంగా కనిపించింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల కృపాకటాక్షాలను కోరుకున్నారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన రెండవ రోజునే భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. మహోత్సవ కార్యక్రమంలో కార్యనిర్వహ ణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి. రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, అర్చక వేద పండితులు, భద్రతా సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.



ఆర్టీఐ కమిషనర్ ఆదినారాయణకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి

## ఆర్టీఐ కమిషనర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి

**పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
ఇటీవల ఆర్టీఐ కమీషనరుగా నియమితులైన గాజుల ఆదినారాయణను సోమవారం అనంతపురం ఆర్అండ్ బి అతిథి గృహం నందు మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాచారహక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం అని చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాపునాడు సంఘం జిల్లా అద్యక్షులు పాండు తదితరులు పాల్గొన్నారు.



దొంగల నుండి స్వాధీనం చేసుకున్న నీటి మోటర్లు, నగదు, బంగారం

## దొంగలు అరెస్ట్

*ఎస్సై నాగమధు..*

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
మండల పరిధిలోని పూలచెర్ల గ్రామంలో రెండు ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడిన దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగమధు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాగ మధు మాట్లాడుతూ గత నెలలో మండల పరిధిలోని పూలచెర్ల గ్రామంలో చాకలి రామన్న , బెస్త వన్నూరు స్వామి ఇంటిలో ఎవరు లేని సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. చాకలి రామన్న ఇంటిలో ఐదు గ్రామాల గ్రాముల బంగారు ఉంగరం వెయ్యి రూపాయల నగదు వన్నూరుస్వామి ఇంటిలో పదివేల రూపాయల నగదు మరియు గ్రామ శివారులలో ఉన్న జడ్పీహెచ్ పాఠశాలలో నీళ్ల పంపింగ్ కోసమ్ ఏర్పాటు చేసిన మోటర్ ను దొంగలించుకు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కనేకల్ ఎస్సై దర్యాప్తు చేయగా. ఫిబ్రవరి 9 సోమవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి పూల చెట్ల గ్రామ శివారులో ఉండగా బళ్లారి నుండి కళ్యాణదుర్గం వెళ్లే రోడ్డు వద్ద పాలిథిన్ సంచులతో దొంగ బాలురు అనుమాన స్పృహంగా పోలీసులను గమనించిన దుండగులు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటనే పట్టుకుని విచారించగా ఇళ్లల్లో మరియు పాఠశాల ప్రాంగణంలో దొంగతనాలు చేసినామని, అదేవిధంగా గతంలో కూడా కనేకల్ మండలం నల్లంపల్లి గ్రామం శివారులలో ఉన్న ఒక ఇంటి కాంపౌండ్ లో ఉన్న నీటి మోటర్ ను సైతం దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. ఇద్దరు మైనర్ బాలురు చేసిన నేరం మేరకు వారిని మధ్యవర్తుల సమక్షంలో తదుపరి చర్య నిమిత్తం కస్టడీ లోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.



సీడ్ క్యాపిటల్ లోన్లపై అవగాహన కల్పిస్తున్న ఏపిఎం ఆంజనేయులు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకోండి

*ఏపీఎం ఆంజనేయులు..*

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
ప్రభుత్వం చేతి వృత్తుల వారికి అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగపరచుకోవాలని మండల సమాఖ్యలో సీడ్ క్యాపిటల్ లోన్ లబ్ధిదారులకు 7,9 తేదీలలో రెండు రోజులు అవగాహన కలిపించామని ఏపిఎం ఆంజనేయులు అన్నారు. స్థానిక మండల సమైక్య కార్యాలయంలో అవగాహన కల్పించమన్నారు. శ్రీనిధి ద్వారా 40 వేల రూపాయలు లోన్ పొందిన సభ్యురాలు ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్ప్రైజెస్ లబ్ధిదారులకు సైతం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడ్ క్యాపిటల్ లోన్ 40000 తో పాటు అదనంగా 75 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 35% సబ్సిడీతో కొనసాగుతున్న పథకాలను వివరించారు. ఈ ట్రైనింగ్ లో మండలంలోని అన్ని గ్రామాల సభ్యులు పాల్గొన్నారు. లోన్లను సద్వినియోగం పరుచుకోని అభివృద్ధి పథంలో ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీలు గోవిందు, తిమ్మారెడ్డి, వన్నూరు స్వామి, తిప్పేస్వామి, చంద్రశేఖర్,ఎర్రి స్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వనజమ్మ కార్యదర్శి నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

## బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి హుండీల లెక్కింపు

*శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం హుండీ ఆదాయం రూ. 1,64,612..*
*శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం రూ 30,850..*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
బెళుగుప్ప మండలం పరిధిలోని రామసాగరం గ్రామ సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలసిన బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు సోమవారం ఆలయాల కమిటీ, దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగింది. బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి ఆలయం హుండీ ఆదాయం 1,64,612 రూపాయలు, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం 30,850 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో బాబు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ సంజీవరాయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రిస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివ శంకరప్ప, ఆలయాల ప్రధాన అర్చకులు జ్ఞానేశ్వర స్వామి, వాసుదేవరాయ స్వామి, సలహాదారుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈనెల ఫిబ్రవరి 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు స్వామివార్ల తిరునాళ్లు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

### 17న కళ్యాణోత్సవం, మహా రథోత్సవం భక్తులకు విస్తృత ఏర్పాట్లు..

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
పెన్నానది పరివాహక ప్రాంతంలో వెలసిన చారిత్రాత్మక దేవాలయం, దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్ నాయుడు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు, చలువ పందిళ్లు, త్రాగునీటి వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

**ఆలయ విశేషాలు – స్థల పురాణ ప్రాశస్త్యం..**
అనంతపురం జిల్లా తాడిపత్రిలోని పెన్నా నది ఒడ్డున ఉన్న శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం 15వ శతాబ్దానికి చెందిన చారిత్రాత్మక, అద్భుత శిల్పకళా కట్టడం. విజయనగర సామ్రాజ్య కాలంలో పెమ్మసాని రామలింగ నాయుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. పెన్నానదికి దాదాపు 20అడుగుల ఎత్తున గల ఈ ఆలయంలోని ప్రధాన శివలింగం కింద నుంచి ఏడాది పొడవునా నీరు ఉద్భవించడం (బుగ్గ) విశేషం. అందుకే స్వామి స్వయంభువుగా వెలిశాడనే నమ్మకం ఉంది. పెన్నా నదిలో నీరు లేకపోయినా, సంవత్సరంలో 365 రోజులు శివలింగం చుట్టూ నీరు ఉండటం ఇక్కడి ప్రత్యేకతగా భక్తులు చెబుతారు.
స్థల పురాణం ప్రకారం తాటకి రాక్షసిని సంహరించిన అనంతరం ప్రాయశ్చిత్తంగా శ్రీరామచంద్రుడు ఇక్కడ స్వయంభూ శివలింగాన్ని ప్రతిష్టించాడని, అప్పటినుంచి ఈ ఆలయం శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. క్రీ.శ. 1460 ప్రాంతంలో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు సమాచారం. ప్రతి సంవత్సరం చైత్ర, వైశాఖ, జ్యేష్ట మాసాల్లో ప్రధాన ద్వారం గుండా సాయంత్రం సూర్యకిరణాలు నేరుగా స్వామి లింగంపై పడటం మరో విశేషం.



శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి మూల విరాట్

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్..**
ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజూ స్వామివారు విభిన్న అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.
10వ తేదీన అంకురార్పణ, 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిత్రగోపుర సేవ, 12వ తేదీ ఉదయం వాసుకి వాహనం, రాత్రి శేష వాహనం, 13వ తేదీన రాత్రి సింహ వాహనం, 14వ తేదీ రాత్రి నరమృగ వాహనం, 15వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పగలు నంది వాహనం, రాత్రి అధికార నంది వాహనం, 16వ తేదీ రాత్రి గజ వాహనం, 17వ తేదీ ఉదయం స్వామివారి కళ్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు మహా రథోత్సవం, 18వ తేదీ రాత్రి అశ్వ వాహనం, 19వ తేదీ పగలు వసంతోత్సవం, రాత్రి హంస వాహనం, 20వ తేదీన ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## వైకాపా నా సేవలను గుర్తించలేదు..

### అందుకే పార్టీ వీడుతున్నా.. జేసీ ప్రభాకర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితుడనై టీడీపీలో చేరుతున్నా.. వైఎస్ఆర్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు హిరాపురం గయాజ్ బాషా (మున్నా)..




మాట్లాడుతున్న హిరాపురం గయాజ్ బాషా (మున్నా)

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదని, అందుకే ఆ పార్టీని వీడుతున్నట్లు వైఎస్ఆర్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు హిరాపురం గయాజ్ బాషా (మున్నా) ప్రకటించారు. తాడిపత్రి నియోజకవర్గంలో మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడై ఈనెల 11న తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు వెల్లడించారు.
తాడిపత్రిలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మున్నా మాట్లాడారు. 2008 నుంచి హెచ్ఎన్ఎస్ ట్రస్ట్ ద్వారా నేటికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. 2013లో రాజకీయాల్లోకి వచ్చానని, 2014లో కౌన్సిలర్ గా ఎన్నికైనానని, 2015లో వైకాపా జిల్లా మైనారిటీ అధ్యక్షునిగా చేశానానని, దాదాపు పదేళ్లపాటు రాజకీయాల్లో క్రియాశీలంగా పని చేశానని తెలిపారు. ప్రజల కోసం తన స్వంత ఖర్చులతోనే ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని చెప్పారు. తాను పని చేస్తున్న పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవలు చేయవచ్చని ఆశించానని, కానీ తీవ్ర నిరాశే ఎదురైందన్నారు.
తాను ఏ పార్టీకోసం పనిచేశానో ఆ పార్టీలోని నాయకత్వం తనకు అవకాశాలు కల్పించలేదని, కౌన్సిలర్ ఎన్నికలలో తనను ఓడించడానికి వైకాపా నేతలు కృషి చేశారన్నారు. దాంతో మనస్తాపం చెంది కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. గత శాసనసభ ఎన్నికల సమయంలోనే టీడీపీలో చేరాలని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ పవన్ కుమార్ రెడ్డి తనను ఆహ్వానించారని గుర్తుచేశారు. అప్పట్లో వ్యక్తిగత సమస్యల కారణంగా రాజకీయాల్లోకి రాలేకపోయానని తెలిపారు. తాడిపత్రి అభివృద్ధిపై జేసీ కుటుంబం చూపుతున్న దూరదృష్టి, పనితీరు, ప్రజలకు దగ్గరగా ఉండే విధానం తనను తీవ్రంగా ఆకర్షించాయని మున్నా తెలిపారు. మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి ప్రజల అవసరాలను గుర్తించి పనిచేస్తున్న నాయకులని కొనియాడారు.
తనకు పదవులపై ఆశ లేదని, హామీలు కూడా ఎవరూ ఇవ్వలేదని, తాను ఏమీ అడగలేదని, తాడిపత్రి అభివృద్ధిలో భాగస్వామిని కావాలన్నదే తన లక్ష్యంగా, ప్రజల కోసం నిజాయితీగా పనిచేయాలనే ఉద్దేశంతోనే టీడీపీలో చేరుతున్నానని మున్నా స్పష్టం చేశారు.
ఈనెల 11న ఉదయం 10 గంటలకు తాడిపత్రిలోని తన బీడీ ఫ్యాక్టరీలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఇప్పటివరకు తన సేవలను గుర్తించి ఆశీర్వదించినట్లే, భవిష్యత్తులోనూ తమ మద్దతు అందిస్తారన్న పూర్తి నమ్మకం తనకు ఉందన్నారు. తాను నమ్ముకున్న ప్రజల కోసం, నమ్ముకున్న నాయకుల కోసం విశ్వాసంగా పనిచేస్తానని ఈ సందర్భంగా మున్నా ప్రకటించారు.

## విద్యార్థులను ప్రోత్సహిస్తే విజయం సాధిస్తారు

### విద్యార్థులను బడికి గైర్హాజరు చేయొద్దు... 10 విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ... ప్రతిరోజు విద్యార్థులను బడికి పంపించే బాధ్యత మీదే... 10వ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన .. ఎంఈఓ -2 హరికృష్ణ..



10వ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ 2 హరికృష్ణ

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
విద్యార్థులను ప్రోత్సహిస్తే... వారు అన్నింట విజయాలు సాధిస్తారని 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈఓ 2 హరికృష్ణ అవగాహన కల్పించారు. సోమవారం సాయంత్రం ఎంఈఓ 2 హరికృష్ణ మండలం పరిధిలోని బ్రాహ్మణపల్లి, నరసాపురం గ్రామాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు విద్యార్థుల చదువు, వారి అభివృద్ధి, పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్ పై ప్రత్యేక శ్రద్ధ,పలు విషయాలపై అవగాహన కల్పించారు.పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపి తమ పని అయిపోయిందని, అంతా అయ్యవార్లే చూసుకుంటారని నిర్లక్ష్య ధోరణిలో ఉన్న తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లే పిల్లలను వ్యవసాయ పనులకు, ఇంటి పనులకు ఉంచుకుని పాఠశాలకు గైర్హాజరు చేస్తున్నారు. ముఖ్యంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న కొంతమంది తల్లిదండ్రుల విద్యార్థులను కూడా అన్ని పనులకు వాడుకుంటున్నారు. కొంతమంది తల్లిదండ్రులు విద్యార్థులు బడికి వెళ్తున్నారా లేదా అని కూడా చూడట్లేదు. ఇలాంటి ధోరణి తో గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చదువులు సన్నగిల్లుతున్నాయి.



10వ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ 2 హరికృష్ణ

పాఠశాలలో హాజరు శాతం తక్కువగా ఉండడంతో పాటు గైర్హాజరైన పదవ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు చదువు యొక్క ప్రాముఖ్యత, గైర్హాజాతో నష్టాలు, పదవ తరగతి విద్యార్థులకు జరిగే నష్టాల గురించి ఎంఈఓ 2 హరికృష్ణ విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుచున్నాయన్నారు.పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడిందని ఈ సమయంలో పదవ తరగతి విద్యార్థులను ఏ తల్లిదండ్రులు కూడా వ్యవసాయ పనులకు, ఇంటి పనులకు ఉపయోగించుకోరాదని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థిని తల్లిదండ్రులు ప్రతి రోజు పాఠశాలకు తప్పకుండా హాజరు చేయాలన్నారు. అప్పుడే మీ పిల్లలు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి, భవిష్యత్తు బంగారు బాట అవుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ -2 హరికృష్ణ తో పాటు సీఆర్పీ నరసింహులు వెళ్లారు.



బ్రాహ్మణపల్లి, నరసాపురం గ్రామాల్లో 10వ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్‌పై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ 2 హరికృష్ణ



ప్రత్యేక అలంకరణలో మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామి

## శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక మాఘమాస పూజలు

*స్వామికి పంచామృత, రుద్రాభిషేకం...*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
బెళుగుప్పలో వెలసిన మరకతలింగ శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు గ్రామస్తుల ఆధ్వర్యంలో మరకత లింగ శ్రీ రామేశ్వర స్వామివారికి పంచామృత రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అక్రమ కట్టడాల తొలగింపు

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
యాడికి మండల కేంద్రంలో శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో చేపట్టిన అక్రమ కట్టడాలను సోమవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి పోలీసుల సాయంతో తొలగించారు. ఆలయం సమీపంలో స్వామి స్థలంలో ఏర్పాటుచేసిన అక్రమ కట్టడాలను జెసిపిల సహాయంతో తొలగించారు. అనంతరం కుంట ప్రాంతంలో అక్రమ కట్టడాలను పరిశీలించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల అనంతరం వాటిని కూడా తొలగిస్తామని తెలిపారు. శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి లకు దాదాపు 1200 ఎకరాల భూమి ఉన్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు చందాలు చేసి బ్రహ్మోత్సవాలు చేసుకోవడం దారుణమని అందుకే భూమిని ఆక్రమించి కట్టుకున్న వారిని తొలగించి స్వామికి ఆదాయ వచ్చేటట్టు చేస్తామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి వివరించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ యాదవ్. టిడిపి జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి లిప్ త్రోబాల్ పోటీల్లో అనంతపురం జట్టు విజేత

*ఉత్కంఠ భరితంగా ఉపాధ్యాయినుల త్రో బాల్ పోటీలు*

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 9:**
రాష్ట్రస్థాయిలో లిప్ త్రో బాల్ ఆటలో మహిళా టీచర్ల వివిధ జిల్లాల జట్లకు ఆదివారం ,సోమవారం రోజుల్లో సెమీఫైనల్స్, ఫైనాన్స్ పోటీలు గుంటూరు జిల్లా మంగళగిరిలోని డాక్టర్స్ క్రికెట్ అకాడమీ మైదానంలో ఉత్కంఠ భరితంగా సాగాయి . లిప్ త్రోబాల్ పోటీల్లో ఫైనల్స్ కు అనంతపురం, ఏలూరు జట్లు వచ్చాయి. ఫైనల్స్ లో మొదటి మ్యాచ్ లో అనంతపురం జట్టు కు 25 పాయింట్స్,ఏలూరు జట్టుకు 21 పాయింట్స్ రావటం తో అనంతపురం గెలిచింది. రెండవ మ్యాచ్ లో అనంతపురం కు 17 పాయింట్స్, ఏలూరు కు పాయింట్స్ 22 రావటం తో ఏలూరు గెలిచినట్లు అయ్యింది. చివరకి 15 పాయింట్స్ కి రెండు జట్ల మధ్య ఫైనల్ పోటీ ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ ఫైనల్ పోటీ లో ఏలూరు జట్టుపై 5 పాయింట్స్ తేడా తో అనంతపురం మహిళా టీచర్స్ జట్టు విజయం సాధించి కప్ గెలుచుకుంది.అనంతపురం జట్టు గెలవటం పట్ల పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన లిప్ త్రోబల్ టోర్నమెంట్ ని మంగళగిరి డాక్టర్స్ క్రికెట్ అకాడమీలో జరిగాయి.. వివిధ జిల్లాల్లో డివిజన్ స్థాయి పోటీలు పూర్తయిన తర్వాత ఈ టోర్నమెంట్లో భాగంగా మొదట అనంతపురం జిల్లా అనకాపల్లితో ఫస్ట్ త్రోబాల్ మ్యాచ్ గెలవగా సెకండ్ క్వార్టర్ ఫైనల్స్‌లో చిత్తూరు జిల్లాతో అనంతపురం గెలిచింది. తర్వాత సెమీ ఫైనల్ అల్లూరి సీతారామరాజు జిల్లాతో గెలిచి ఫైనల్‌కి అనంతపురం జిల్లా చేరుకుంది ఫైనల్ మ్యాచ్లో ఏలూరు జిల్లాతో పోటీపడి అనంతపూర్ జిల్లా విజయం సాధించింది. అనంతపురం జిల్లా లీఫ్ త్రో బాల్ జట్టు
కెప్టెన్ కే లక్ష్మి దేవి, (జడ్పీహెచ్ఎస్ ,పోలికి) , బి. ఇందుమతి( జడ్.పి.హెచ్.ఎస్, పాల్తూరు), ఎస్ నాగమ్మ (జడ్పీహెచ్ఎస్ చీకలగురికి), జీ ప్రమీల (ఏపీ మోడల్ స్కూల్ విడపనకల్లు), ఎ ఎస్ సరస్వతి బాయ్ ,సి .లక్ష్మీదేవి (పొట్టి శ్రీరాములు, అనంతపురం మున్సిపల్ హైస్కూల్), కోనా వరలక్ష్మి (12వ వార్డ్ మున్సిపల్ స్కూల్, అనంతపురం ),వి సునీత (ఎంపీపీ ఎస్ ఓబులాపురం ) హెచ్ సునీత( ఎంపీపీ ఎస్ డి హీరే హల్). ఏ .జ్యోతి (జడ్.పి.హెచ్.ఎస్ హంచన్ హాల్). కోచ్ శకుంతల,స్కూల్ గేమ్ ఫెడరేషన్ తరుపున శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మే 3న నీట్ యూజీ-2026 పరీక్ష

**ఢిల్లీ, ఫిబ్రవరి 9:**
వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్) యూజీ–2026 నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్ష షెడ్యూల్ వివరాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) వెల్లడించింది. నీట్ యూజీ–2026 పరీక్షను ఈ ఏడాది మే 3న నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ నెల 8 నుంచే ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, చివరి తేదీ మార్చి 8 అని, ఆ రోజు రాత్రి 9 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.



## కొడగార్లగుట్ట గ్రామంలోకి చొరబడిన చిరుత


**భయందోళనలో ప్రజలు..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామంలోకి ఆదివారం రాత్రి చిరుత చొరబడడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతానికి అనుకోని గ్రామం వుండడంతో రాత్రి వేళలో చిరుత, ఎలుగుబంట్లు చొరబడడంతో తీవ్ర భయందోళనకు గురి కావాల్సి వస్తుందని తెలియజేస్తున్నారు. ఈరన్న అనే వ్యక్తి ఇంటి దగ్గర పెంచుకొన్న పెంపుడు కుక్క ను ఆదివారం రాత్రి చిరుత దాడి చేసిందని తెలిపారు. కావున అటవీ శాఖ అధికారులు చిరుత సంచారాన్ని పసిగట్టి గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామప్రజలు అధికారులకు విన్నవిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ముందుండాలి

**ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం దిశగా చర్యలు..**
**90 ఫిర్యాదులు స్వీకరణ..**
**అడిషనల్ ఎస్పీ అంకిత సురాన..**

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** పుట్టపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ అంకిత సురాన నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అడిషనల్ ఎస్పీ వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, మోసాలు, ఆస్తి తగాదాలు, దౌర్జన్యాలు, ఇతర పోలీసు సంబంధిత అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను అందజేశారు.
అందిన ప్రతి అర్జీపై తక్షణమే విచారణ ప్రారంభించి, చట్ట పరిధిలో బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కొన్ని ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే పరిష్కార మార్గాలు సూచించారు.
వికలాంగులు, వృద్ధులు, మహిళల నుంచి వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధితులు పోలీసు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారం జరగాలని అధికారులకు సూచించారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ అంకిత సురాన

ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 90 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా కేంద్రానికి రావలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీప పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు లేదా సబ్ డివిజన్ కార్యాలయాల్లో అందజేయవచ్చని తెలిపారు. అక్కడ స్వీకరించిన ఫిర్యాదులను కూడా ఇదే వేదికలో భాగంగా పరిగణించి సకాలంలో న్యాయం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ ఇస్మాయిల్, డిటిఆర్బీ సీఐ లక్ష్మీకాంత్ రెడ్డి తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెదేపా సీనియర్ నాయకుడు చారుపల్లి కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, నాయకులు

## తెదేపా సీనియర్ నాయకుడు చారుపల్లి కృష్ణారెడ్డికి పరామర్శ

**ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్..**

**తనకల్లు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** తనకల్లు మండలం గందోడివారి పల్లెకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు చారుపల్లి కృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చారిపల్లి కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కృష్ణారెడ్డికి అవసరమైన మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్లు బీగం శంకర్ నాయుడు, రాజారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఇంచార్జి తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జడ్పీటీసీ అనంతరాజు, నాయకులు

## ఇంచార్జి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సన్మానం

**జడ్పీటీసీ అనంతరాజు ..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** ఇంచార్జి తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌ను సోమవారం జడ్పీటీసీ అనంతరాజు, గుడిబండ జడ్పీటీసీ భూతరాజు, సీనియర్ వైకాపా నాయకులు న్యాయవాది రంగనాథ్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా భూ సమస్యలకు సంబంధించిన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని ఇంచార్జి తహసీల్దార్ తెలిపారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పరిశీలన

**డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** మండలంలోని బిజీ హళ్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్ పరిశీలించారు. సర్వే ను వేగవంతం చేయాలని అన్ని కుటుంబాలను యూనిఫైడ్ సర్వే ద్వారా గుర్తించాలని అటెండెడ్ ఎనర్జీ అసిస్టెంట్, పీడీఓ,లకు అయన సూచించారు



యూనిఫైడ్ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్

## రాష్ట్రాభివృద్ధిపై సుదీర్ఘ వర్చువల్ సమీక్ష

**ఆర్థిక సర్వే నుంచి శాంతిభద్రతల వరకు కీలక అంశాలపై చర్చ..**
**జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్..**
**ఎస్పీ ఎస్ సతీష్ కుమార్..**

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, సెక్రటరీ స్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్లు, డివిజన్, మండల స్థాయి అధికారులు, స్వర్ణ పంచాయతి ఉద్యోగులు పాల్గొనగా శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.
ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. జాతీయ ఆర్థిక సర్వే–2025–26, జీడీపీ, జీఎస్‌డీపీ వృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్వర్ణాంధ్ర పనిసూత్రాల అమలు పురోగతిని పరిశీలించి, మరింత సమర్థవంతమైన అమలుకు సూచనలు చేశారు.
రాష్ట్రంలో ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, వాటి పురోగతి,



సీఎం వర్చువల్ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, ఇతర అధికారులు

ఎదురవుతున్న సవాళ్లపై అధికారులతో చర్చించారు. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడుల ఆకర్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అవేర్, డేటాలెక్, పరిపాలనా సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాల వినియోగం ద్వారా రియల్ టైమ్ గవరెన్స్ అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి కల్పన, ఒక కుటుంబం––ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనపై కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. అదేవిధంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ అంశంపై అధికారులతో చర్చించి, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలను తీసుకోవాలని సూచించారు. అన్ని అంశాల అమలు, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఫలితాలే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.



తెదేపా సీనియర్ నాయకుడు చారుపల్లి కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, నాయకులు

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమం

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** మడకశిర మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీ.ఎన్. మాలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో మడకశిర మండల పరిధిలోని బుల్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె. విశ్వనాథ్ అధ్యక్షతన యుటిఎఫ్ పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కే. భూతన్న, జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదన్నారు.ఉపాధ్యాయులు ఎదురుకొంటున్న 12వ పి ఆర్ సి కమిటీ చైర్మన్ నియామకం చేయాలని, ఆలస్యమైతే 29శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను విడుదల చేయాలని,సరెండర్ లీవ్స్ బిల్లు బకాయిలను ఇతర ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.ఓబన్న, ఎం. లక్ష్మీనారాయణ, వెంకటేష్ ప్రసాద్, నరసింహమూర్తి, సుహాసిని, నాగవేణి, మాధవి, లక్ష్మీదేవి, నాగ దీప, హేమలత, మోహన్, మధుసూదన్, దొరబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోస్ట్ కార్డు ఉద్యమం చేపడుతున్న ఉపాధ్యాయులు

## ఏపీ ఏఐఎంఎస్ యాప్ రైతన్నలకు ఎంతో ఉపయోగకరం

**మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్..**

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వ్యవసాయానికి అవసరమైన కీలక సమాచారం సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ఎంతో ఉపయోగకరమని నల్లమాడ వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ పత్రికా ప్రకటనలో తెలిపారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అనేక సేవలను ఒకేచోట పొందవచ్చని ఆయన తెలిపారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత ఎంపీఎన్ సృష్టించుకుని యాప్‌లోకి ప్రవేశిస్తే రైతులకు అవసరమైన సమాచారం తక్షణమే లభిస్తుందని పేర్కొన్నారు.
ఈ యాప్ ద్వారా వ్యవసాయ శాఖ విడుదల చేసే నోటిఫికేషన్లు, పంటలకు వచ్చే చీడపీడలపై ముందస్తు హెచ్చరికలు, నివారణ చర్యలపై సలహాలు రైతులకు నేరుగా అందుతాయని తెలిపారు. పంట సాగు దశలో ఎదురయ్యే సమస్యలకు





మొబైల్ ఫోన్లో యాప్



మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్

సంబంధించి అవసరమైన మార్గదర్శకాలు యాప్‌లో లభించడంతో రైతులు నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. మార్కెట్ ధరలకు సంబంధించిన సమాచారం రోజువారీగా అందుబాటులో ఉండటంతో పంటలను ఎప్పుడు అమ్మాలనే నిర్ణయం రైతులు సకాలంలో తీసుకోవచ్చని ఆయన తెలిపారు.
అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించిన తాజా వార్తలు, ప్రభుత్వ ప్రకటనలు, ముఖ్యమైన అధికారుల సంప్రదింపు వివరాలు యాప్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టం సంభవించినప్పుడు సంబంధిత వివరాలను నమోదు చేసుకునే అవకాశం కూడా ఈ యాప్‌లో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే వివిధ ప్రయోజనాలు, సబ్సిడీలు, సహాయ పథకాల సమాచారం యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు.
సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా రైతులు వ్యవసాయంలో ముందడుగు వేయవచ్చని, ఉత్పత్తి పెంపుతో పాటు ఆదాయం మెరుగుపడుతుందని అబ్దుల్ హక్ తెలిపారు. కావున ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీ ఏఐఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సోమవారం పత్రికా ప్రకటన ద్వారా రైతులకు సూచించారు.

## నేడు శ్రీస్వామి వారి హుండీల లెక్కింపు

**కదిరి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** కదిరి పట్టణములో వెలసిన శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి హుండీల లెక్కింపు కార్యక్రమం మంగళవారము ఉదయం 6.00 గంటల నుండి ప్రారంభమవుతుందని కార్యనిర్వహణాధికారి తెలిపారు.



చలో సేవాగడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, ఎస్టీ సెల్ నాయకులు



వీరనారాయణ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు వీరనారుప్ప

## అప్పరాచెరువులో వైభవంగా వీరనారాయణస్వామి ఉత్సవాలు

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** మండల పరిధిలోని అప్పరాచెరువు గ్రామంలో వెలసిన శ్రీ వీరనారాయణస్వామి ఉత్సవాలు భక్తుల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ విగ్రహాలను సమీపంలోని చిత్రావతి నదికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వీరనారప్ప ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.ఇంతకుముందు ఆదివారం రాత్రి ఎలవ గంపను గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. సోమవారం రాత్రి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భజనలు, కోలాటాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, స్వామి కాపులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలి

**ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** కుటుంబాల్లో లేదా గ్రామాల్లో తలెత్తే చిన్నపాటి వివాదాలను గొడవలకు దారి తీయకుండా స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ సూచించారు. సోమవారం రాత్రి బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యంగా సోదరుల మధ్య తలెత్తే ఆస్తి సంబంధిత లేదా ఇతర వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, గొడవలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.మహిళలు, పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వారి మీద జరుగుతున్న నేరాల నివారణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని ప్రజలను హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లోధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్

## వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భవతులకు భోజనం ఏర్పాటు

**ఏఎస్ఐ శ్రీరాములు..**

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల తొమ్మిదిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభినయ్ కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు నిమిత్తం గర్భవతులు వస్తారని తెలుసుకున్న ఏఎస్ఐ శ్రీ రాములు సోమవారం గర్భవతులకు ఒక పూట భోజనాల సౌకర్యాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఏ ఎస్ ఐ శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి నెలా గర్భవతులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యపరీక్షలు నిమిత్తం వస్తారని వారు పరీక్షలు చేయించుకొని ఇంటికి వెళ్లేసరికి ఆలస్యం అవుతుందని దీంతో తనవంతుగా గర్భవతులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.శుక్ర వారం గర్భవతులు పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా గర్భవతులు మాట్లాడుతూ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన మాకు భోజనాలు ఏర్పాటు చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీరాములు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ నాయక్ డాక్టర్ చిదానంద, సూపర్వైజర్ జయమ్మ, హాస్పిటల్ సిబ్బంది గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీరాములు

# ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

**ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామం ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బంగారప్ప సోమవారం పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంగారప్ప మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ కల్వర్టులు లేక మురుగునీరు రోడ్లపై నిలిచి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామ స్మశానంలో ముళ్లకంపలు విపరీతంగా పెరిగిపోవడంతో అంత్యక్రియల సమయంలో తీవ్ర అసౌకర్య పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. స్మశానంలో దుర్గంధం వ్యాపిస్తూ కాలనీ ప్రజలు మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. స్మశాన స్థలం కబ్జాకు గురయ్యే ప్రమాదం కూడా ఉందని, అందువల్ల అక్కడ ముళ్లకంపలను తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. దళిత, అణగారిన వర్గాల ప్రజల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.


ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


పోస్టు కార్డు ఉద్యమం చేపట్టిన యూటీఫ్ నాయకులు

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోస్టు కార్డు ఉద్యమం

**యూటీఎఫ్ నేతల డిమాండ్..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
ఉద్యోగుల ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కౌలన్న తెలిపారు. యూటీఫ్ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ భూపాల్, నాయకులు చంద్రపాల్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దకడబూరులోని పోస్టాఫీస్ సమీపంలో ఉన్న పోస్టు బాక్స్‌లో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన పోస్టు కార్డులను వేసి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో ఉద్యోగులకు జరిగిన ఆర్థిక నష్టానికి ఇప్పటివరకు ప్రభుత్వం న్యాయం చేయలేదని విమర్శించారు. 2023 నుండి అమలులోకి రావలసిన పీఆర్సీ కమిషన్‌ను ఇప్పటికీ నియమించకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోందన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని, అంతవరకు 29 శాతం ఇంటరిమ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బకాయిల చెల్లింపులపై స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు, మెడికల్ బిల్లులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారిని పోస్టు కార్డుల ద్వారా కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని యూటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నల్లారెడ్డి, శంకరయ్య, కనికె వీరేశ్, శ్రీధర్రావ్, రుక్మాందుగుడు, అశోక్, కమతం వీరేశ్, ప్రవీణ్, భాస్కర్, రాఘవేంద్ర, ఎ.ప్రవీణ్, కోటేకల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి

# గురుజాల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, గంజహళ్లి ఉరుసు మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

**ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
నందవరం మండలం గురుజాల గ్రామంలోని శ్రీ పర్వతవర్ధన సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఈనెల 23న జరగనున్న శ్రీశ్రీశ్రీ సద్గురు మహాత్మ గంజహళ్లి బడేసాహెబ్ స్వామి 332వ ఉరుసు మహోత్సవం ఏర్పాట్లపై ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు, యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వెహికల్ పార్కింగ్, విద్యుత్ సరఫరా, ఆలయ ప్రాంగణంలో తగిన లైట్లా ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, బ్యారికేడ్లు, పారిశుధ్యం, నడక మార్గాలు, నదీ ప్రాంతంలో భద్రతా చర్యలు, మరుగుదొడ్ల ఏర్పాటు, ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండుగలు అత్యంత భక్తిశ్రద్ధలతో, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఎంసీ చైర్మన్, ఎండోమెంట్ ఈఓ, రూరల్, గోనెగండ్ల సీఐలు, ఎస్ఐ, ఎంఆర్ఓ, ఎంపీడీఓలు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌డబీ శాఖల అధికారులు, ఆర్టీసీ డీఎం, టీడీపీ మండల నాయకులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

# రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం అత్యంత దుర్మార్గం

**తిరుమల లడ్డూపై తప్పుడు ఆరోపణలతో భక్తుల మనోభావాలపై దాడి..**
**మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడిని, భక్తుల విశ్వాసాలను వాడుకోవడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్ర ప్రసాదమైన లడ్డూ విషయంలో కూటమి నాయకులు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు, పంది కొవ్వు, గొడ్డు మాంసం కలిసిందంటూ కావాలనే తప్పుడు ప్రచారం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడం అత్యంత దారుణమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలైన ఎన్ఆర్‌డీఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు నిర్వహించిన శాస్త్రీయ పరీక్షల్లో ఎలాంటి కల్తీ జరగలేదని తేలిందని గుర్తు చేశారు. అధికారిక నివేదికలు వెలువడినప్పటికీ కూటమి నాయకులు ఇప్పటికీ అబద్ధపు ప్రచారాన్ని కొనసాగించడం మరింత దుర్మార్గమని విమర్శించారు. నిజం బయటపడిన తర్వాత కూటమి నాయకులపై తిరుమల స్వామివారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయిన చంద్రబాబు నాయుడు తన రాజకీయ జీవితం కాపాడుకునేందుకు దేవుడినే వాడుకుంటున్నారని ఆరోపించారు. తన అబద్ధాలను నిజాలుగా మార్చేందుకు నానా రకాల కుట్రలకు పాల్పడుతున్నాడని, ఇందులో భాగంగానే తిరుమల లడ్డూ అంశాన్ని రాజకీయంగా వాడుకున్నాడని అన్నారు. ప్రజలకు, భక్తులకు క్షమాపణ చెప్పాల్సిన చంద్రబాబు నాయుడు, దానికి బదులుగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిగిన దర్యాప్తుపై దాడులు చేయడం, ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులపై దాడులు చేయించడం, వారి ఇళ్లను తగలబెట్టడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్రతను అపహాస్యం చేసిన చంద్రబాబు నాయుడు తప్పనిసరిగా ప్రజలకు, కోట్లాది మంది భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్న గారు స్పష్టంగా డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి


మెగా జాబ్ మేళా పోస్టర్లు విడుదల చేస్తున్న శాసనసభ్యులు డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి

# మెగా జాబ్ మేళా పోస్టర్లు విడుదల

**శాసనసభ్యులు డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
ఎమ్మిగనూరులో నిర్వహించబడనున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత తమ అర్హతలకు అనుగుణంగా ఈ జాబ్ మేళాలో పాల్గొని మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 10 తేదీ జరిగే జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 11 ప్రముఖ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటాతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల ఒస్కిల్ హబ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అధ్యాపకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

**సీపీఎం, సీఐటీయూ నేతల పిలుపు..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 12న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగ యువత ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దకడబూరు గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ కార్మిక వర్గాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకరించే విధానాలను అమలు చేస్తూ, కార్మికుల హక్కులు, ఉపాధి భద్రతలను కాలరాస్తోందన్నారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక చట్టాలనే నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కోడ్ల వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటుందని, పని గంటలు పెరిగినా వేతనాలు పెరగని పరిస్థితి నెలకొందన్నారు. అందుకే ఈ కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు కుటుంబాన్ని పోషించడం అసాధ్యంగా మారిందని వారు తెలిపారు. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశంలోని గ్రామీణ పేదల జీవనాధారమని వారు పేర్కొన్నారు. ఆ పథకం పేరును మార్చడం ద్వారా దాని అసలు ఉద్దేశాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం, పని దినాలను కుదించడం వంటి చర్యలు పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలుగా అభివర్ణించారు. పథకం పేరులో మహాత్మాగాంధీ పేరు కొనసాగించడంతో పాటు దానిని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, గ్రామీణ పేదలు పెద్ద ఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య, ఆదిలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న


సార్వత్రిక సమ్మె గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు



# ఏసీబీకి చిక్కిన కొత్తగూడెం ఎపి ఫ్ డి సీ ఫారెస్ట్ డివిజనల్ మేనేజర్

**కొత్తగూడెం, ఫిబ్రవరి 9 :**
కొత్తగూడెం ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ తాటి శ్రావణిని ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో ఏసీబీ టీమ్ విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. రూ.28 లక్షలు డిమాండ్ చేసి, రేంజర్ రాజేందర్, మధ్యవర్తి గోపాలకృష్ణ ద్వారా రూ.3.50లక్షలు తీసుకుంటున్న సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండలం సీతాయిగూడెంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. టన్నుకు 90 రూపాయల చొప్పున మొత్తం రూ.28 లక్షలు డిమాండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రేంజర్ ను ఏసీబీ అధికారులు హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు. అప్పటినుండి డివిజనల్ అధికారిణి శ్రావణి పరారీలో ఉన్నారు. ఏసీబీ ఆమె పై నిఘా పెట్టి విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె ముందస్తు బెయిల్ కు కూడా పెద్ద ఎత్తున ప్రయత్నించినట్లు తెలుస్తోంది. శ్రావణిని ఏసీబీ కోర్టు ముందు హాజరు పరచనున్నారు. ఈ కేసు అటవీ అభివృద్ధి సంస్థలో సంచలనం సృష్టించింది.

# పి.ఆర్.కమిషన్ చైర్మన్‌ను నియమించండి

**యుటియఫ్ డిమాండ్..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
ఉపాధ్యాయుకు సమస్యల పరిష్కారానికై ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టినట్లు ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి యుటియఫ్ ఉపాధ్యాయులు తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతభత్యాలను నిర్ణయించే 12వ పి.ఆర్.సి.కమీషన్‌కు చైర్మన్‌ను నియమించాలని యుటియఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు యుటియఫ్ ఎమ్మిగనూరు మండలం(రూరల్) శాఖ అధ్యక్షుడు భాస్కర్ , గురుస్వామి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సిరాలదొడ్డి పార్లపల్లి,గువ్వలదొడ్డి, కలుగొట్ల గ్రామాల పాఠశాలలోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక విషయాలకు సంబంధించిన డిమాండ్లతో కూడిన పోస్ట్ కార్డులను ముఖ్య మంత్రికి రాశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భాస్కర్, ప్రధానకార్యదర్శి గురుస్వామి మాట్లాడుతు ఉద్యోగుల ఆర్థిక సమస్యల పట్ల దృష్టి సారించాలని కోరారు. పోస్ట్ కార్డులో ఉన్న డిమాండ్లను వివరించారు .పి.ఆర్.సి.కమీషన్ చైర్మన్ ను వెంటనే నియమించాలని, మధ్యంతర భృతిని 29 శాతం ప్రకటించాలని, ఉద్యోగుల పెన్షనర్ల బకాయిల చెల్లింపు లకై రూట్ మ్యాప్ ప్రకటించాలని, సి.పి.యస్.రద్దుచేయాలని, మెమో 57 ప్రకారం 2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, హెల్త్ కార్డుల, మెడికల్ బిల్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రానున్న బడ్జెట్ సమావేశాలలో పై సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ సీనియర్ నాయకులు జ్ఞనప్రకాష్ మండల కార్యదర్శి రాజన్న, బాబు, ఉపాధ్యాయులు నరసప్ప సంధ్య,షకీల,నరసప్ప, ఖడ్గమ్ రాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టిన యుటియఫ్ ఉపాధ్యాయులు


పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టిన యుటియఫ్ ఉపాధ్యాయులు



పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టిన యుటియఫ్ ఉపాధ్యాయులు

# హైవే పక్కన ప్రభుత్వ భూమి ఆక్రమణ

**మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
మదనపల్లె మండలం కొల్లాబైలు గ్రామ సర్వే నంబర్ 672–1 లో జరుగుతున్న ప్రభుత్వ భూమి (రూఔణ) ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారని బహుజన యువసేన నాయకులు పునీత్ కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ కార్యాలయం గతంలోనే నోటీసులు జారీ చేసినా, గడువు ముగిసి నెలలు గడుస్తున్నా ఆక్రమణలు ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు,మారుమూల ప్రాంతాల్లో చిన్న ఇళ్లను తొలగించే అధికారులు, హైవే పక్కనే కోట్లాది రూపాయల విలువైన భూమి ఆక్రమణకు గురవుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు,అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతరులకు విక్రయిస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో సామాన్య ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు,మదనపల్లె జిల్లా కేంద్రం కావడంతో ప్రభుత్వ అవసరాలకు భూమి చాలా కీలకం. వెంటనే ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పునీత్ కుమార్ డిమాండ్ చేశారు,

# 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై సర్కార్ కసరత్తు

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించే అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఈ విషయంపై సమగ్ర అధ్యయనం చేయాలని పోలీస్‌శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. సోషల్ మీడియాలో పెరుగుతున్న విచ్చలవిడితనానికి బ్రేకులు వేయాల్సిందేనని సీఎం పేర్కొన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## చంద్రప్రభ వాహనంపై శ్రీ సోమస్కంధమూర్తి అభయం

**తిరుపతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన సోమవారం రాత్రి శ్రీ సోమస్కంధమూర్తి చంద్రప్రభ వాహనంపై అభయమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. శివుడు అష్టమూర్తి స్వరూపుడు. సూర్యుడు, చంద్రుడు, భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, యజమానుడు శివుడి ప్రత్యక్షమూర్తులు. చంద్రుడు అమృతమూర్తి. వెన్నెల కురిపించి జీవకోటి మనస్సులకు ఆనందాన్ని కలిగించే షోడశకళాప్రపూర్ణుడు. శివభగవానుడు విభూతి సౌందర్యంతో ధవళతేజస్సుతో వెలుగొందుతూ తన కరుణ కిరణాలతో అమృత శీతలకాంతులను జీవులకు అనుగ్రహిస్తాడు. వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

*నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ*
*మంత్రి ఎన్ఎండి ఫరూక్*

**అమరావతి, ఫిబ్రవరి 9:**
రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్ ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి, మంచిర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ ( యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుందన్నారు.నీట్, ఈఏపీ సెట్ ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్ సైట్ www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీఎం కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలన్నారు.అలాగే cedmap2017@gmail.com ఫోన్ నెంబర్:0866-2970567, మొబైల్ నెంబర్ :73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు.

## గంజాయి స్వాధీనం ఇద్దరి అరెస్ట్

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
మండలంలోని బగళ నత్తం గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు . సోమవారం అతని వద్ద నుంచి 7 గంజాయి చెట్లతో పాటు 250 గ్రాములు ఎండు గంజాయిని రామకుప్పం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనేందుకు వచ్చిన వికోట మండలం నాయకనేరి గ్రామానికి చెందిన విజయ్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.బగళ నత్తం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నా సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.

# యాప్‌ల ద్వారా లాభసాటి వ్యవసాయం

### వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి..



**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి రైతు ఉబరైజేషన్ యాప్, ఏపీ ఎయిమ్స్ 2.0యాప్‌ల ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాల గురించి, అత్యాధునిక పద్ధతుల గురించి తెలుసుకొని లాభసాటి వ్యవసాయాన్ని పొందవచ్చని వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేస్తున్న పలు పథకాల కు సంబంధించిన సమాచారాన్ని రైతులు సులువుగా తెలుసుకునేందుకు వీలుగా స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులు తమ మొబైల్లో ఉబరైజేషన్ యాప్, ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్‌ను ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు, ఇందులో భాగంగా మండలంలోని వ్యవసాయ రైతులు సంబంధిత యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పలు పథకాల సమాచారం అలాగే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవచ్చని రైతులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ వారి సౌజన్యముతో రూపొందించబడిన ఊబరైజేషన్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవడం వల్ల కిసాన్ డ్రోన్ పరికరం ను రైతు తనకు ఇష్టం వచ్చిన డ్రోన్ పరికరాన్ని అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకోవడానికి ఉబరైజేషన్ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ను తమ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుంటే పంట కోత యంత్రాలు, బేలర్స్, కస్టమ్ హైరింగ్ పరికరాలను,ట్రాక్టర్, పరికరాలను అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకోవడానికి ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ఉపయోగపడుతుంది అని అన్నారు. అలాగే ఆయా పంటల కు సంబంధించిన చీడ పీడలు యాజమాన్యం,వాటి నివారణ చర్యలు,పథకాల సమాచారం,అధునాతన పద్ధతుల గురించి తెలుసుకోవడానికి ఈ యాప్ లు రైతుకు ఎంత గానో ఉపయోగ పడతాయి అన్నారు. రైతు మరింత సమాచారం తెలుసుకునేందుకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి వాటి గురించి అవగాహన పొందాలని తెలిపారు. ఈ రెండు యాప్‌లను డౌన్లోడ్ చేసుకొనుటకు వీలుగా రైతు సేవా కేంద్రం గ్రూప్ ల్లో లింక్‌లను పంపించారు.

# నేటి నుంచి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
స్థానిక మారుతీ కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మంగళవవారం నుంచి రెండు రోజులపాటు శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం గంగాపూజతో మొదలై గోవుపూజ, పుణ్యాహవచనం, నాంది పూజ,పంచగవ్యం, రుత్వక్ వరుణులు, దీక్షారాధనం, రక్షాబంధనం, ఆదిత్యాది నవగ్రహారాధన, కలస స్థాపన, పూర్వతం షోడ శోపచార పూజ, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టానున్నారు. సాయంత్రం యోగేశ్వర ఆరాధన ధ్వజరోహణం, జలక్షిరాధి వాసములు, దాన్యాదివాసం, పుష్పాదివాసం, సయ్యాదివాసములు, శ్రీ అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ స్థిరీకరణం అనంతరం మహా మంగళారతి తీర్థ ప్రసాద వినియోగం చేపట్టినన్నారు. బుధవారం ఉదయం యోగేశ్వర ఆరాధన ఆదిత్యాది నవగ్రహ పురస్పర మూర్తి హోమాలు, అంగక లాతత్వ హోమాలు, తత్వ కళాన్యాసాలు, 8 గంటల నుంచి 8:30 వరకు జరుగు శుభ కుంభ లగ్నంలో స్వామివారికి నేత్రోన్మిలన ప్రాణ ప్రతిష్ఠ,దేనుదర్శనం, దీపదర్శనం, కుస్మాండా చేదానం, గోపుర కలిశారోహణం, స్వామివారికి షోడోశోపచార పూజ,మహా మంగళహారతి, తీర్చప్రసాద్వినియోగం చెప్పటనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రాణప్రాతిస్టాపన కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని శక్తికొలది ధనం, ధాన్యం వస్తురూపంలో విరాళాలు ఇచ్చి కార్యక్రమంలో పాలుపంచుకోవాలని తెలిపారు.



ముస్తాబైన దేవాలయం

# శ్రీశైలంలో ఏర్పాట్లపై శివస్వాముల ఆగ్రహం


### మౌలిక వసతులు లేవంటూ నిరసన..
### ఈఓ డౌన్ డౌన్ అంటూ నినాదాలు..
### రెండవ రోజే ఇట్లా ఉంటే
### మహాశివరాత్రి రోజు పరిస్థితి ఏంటి అని నిలదీత..

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై శివస్వాములు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేవంటూ నిరసన తెలిపారు. ఈఓ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రెండవ రోజే ఇట్లా ఉంటే మహాశివరాత్రి రోజు పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. శివ స్వాముల తాకిడి ఎక్కువగా ఉంటుందని తెలిసీ దేవస్థానం అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదని, స్పర్శ దర్శనంలో అంతులేని జాప్యం పట్ల అసహనం వ్యక్తం చేశారు. భక్తులు, శివ స్వాముల పట్ల దేవస్థాన అధికారుల తీరు బాగోలేదని గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి అలసిపోయిన వారికి కనీస మౌలిక వసతులు కూడా లేవని, ఇదేమి పాలన అంటూ నిలదీశారు. శివ భక్తులపై భద్రతా సిబ్బంది రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని, భక్తులు, శివ స్వాముల భద్రతను ప్రమాదంలోకి నెట్టి అధికారులు చోద్యం చూస్తున్నారని శివ స్వాములు వాపోయారు . క్యూలైన్‌లలో గంటల తరబడి వేచిఉన్న తమ పట్ల అధికారుల దురుసు ప్రవర్తన, సెక్యూరిటీ సిబ్బంది మాట తీరు సరిగా లేదని శివ స్వాములు నిరసనకు దిగారు. కృష్ణదేవరాయ క్యూలైన్ విరగొట్టి లోపలికి వెళ్లే పరిస్థితి వచ్చింది. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లే ఉన్నారే తప్ప ఎటువంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని శివస్వాములు పెద్ద ఎత్తున ఈఓ డౌన్ డౌన్ అంటూ నిరసనకు దిగారు. ఇప్పుడే పరిస్థితి ఇట్లా ఉంటే మహాశివరాత్రి రోజునాటికి అధికారులు ఇంకేం చేస్తారని భక్తులు, శివ స్వాములు దేవస్థాన అధికారులపై మండిపడుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీశైలం మహాశివరాత్రికి వచ్చే భక్తులకు కనీస వసతులు ఏర్పాటు చేసి క్యూలైన్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, శివ స్వాములకు కనీస మౌలిక ఏర్పాట్లు చేయాలని కోరుకుంటున్నారు.

విషయం తెలుసుకున్న ధర్మకర్తల మండలి చైర్మన్ రమేష్ నాయుడు శివ స్వాములతో మాట్లాడేందుకు ప్రయత్నం చేశారు. స్వయంగా క్యూలైన్ల వద్దకు చేరుకొని శివ స్వాములతో మాట్లాడే ప్రయత్నం చేసినా రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎటువంటి ఫలితం లేకుండా పోయింది .



శ్రీశైలానికి భారీగా తరలివచ్చిన శివస్వాములు



క్యూలైన్ల వద్ద నిరసన తెలుపుతున్న శివ స్వాములు
క్యూలైన్లు విరగొట్టి లోపలికి వెళ్తున్న శివ స్వాములు భక్తులు

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన 22 మంది బాధితులకు రూ. 6.09 లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 188 మంది బాధితులు రూ.1.59 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, మండలల పార్టీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఏపీ ఓ గంగయ్య

## నేటి నుండి ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్ సర్వే

*ఏపీ ఓ గంగయ్య..*

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఉపాధి పనులపై ఆడిట్ కోసం, ఎస్ఆర్పి పి. మీరావలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి డి.ఆర్.పి.లు సర్వే నిర్వహిస్తున్నట్లు ఏపీవో గంగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఓ గంగయ్య ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏపీవో మాట్లాడుతూ ఎస్ఆర్పి మీరావలికి, డిఆర్పి లకు, ఉపాధి సిబ్బంది 2024-25 లో 9 కోట్ల 70 లక్షల పనుల పూర్తి సమాచారాన్ని అందజేయాలన్నారు. ఉపాధి పనులలో ఆడిట్ నిర్వహించే సమయంలో డి ఆర్ పి లు అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించి, ప్రజల నుండి వ్యతిరేకత రాకూడదని సూచించారు. పనులను కొలతలు వేసే సమయంలో, అలాగే కూలీల నుండి సమాచారం సేకరిస్తున్న, సమయంలో ఉపాధి సిబ్బంది ఉండకూడదన్నారు.(పనులు ఏ ప్రాంతంలో జరిగాయి అనే దానిపై ఆడిట్ సర్వే చేసే సిబ్బందికి సమాచారం మాత్రమే ఉపాధి సిబ్బంది ఇవ్వాలన్నారు) అలాగే ఉపాధి సిబ్బంది, ఆడిట్ నిర్వహించే వారికి సహకరిస్తూ మీరు కూడా నిబద్ధత ఉండాలని ఉపాధి సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పి మీరావలి, డిఆర్పిలు ఉపాసిబ్బంది తదితరులు ఉన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్, తదితరులు

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల ముఖచిత్రాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం వీర్నమల నుంచి నల్ల రాళ్ల చేను వరకు1.6 కోట్లతో ఒకటిన్నర కిలోమీటరు మేరా బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. నల్ల రాళ్ల చేను గ్రామస్తులకు గత 25 సంవత్సరాలుగా నెరవేరని కళ సీఎం చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమైందన్నారు. కుప్పం నియోజకవర్గం దశ దిశ మార్చేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధమైందన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 4,82,883 లక్షల రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం 36 కుటుంబాలు వైసిపి పార్టీ కార్యకర్తలు టిడిపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, జిల్లా నేత నారాయణ చారి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, రామ్మూర్తి , చిన్నకృష్ణ, చలపతి, గుర్రప్ప,మహమ్మద్ రఫీ, విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణం,అవినాష్ రెడ్డి ,ఆదిల్, బాలు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసీపీ కార్యకర్తలు

## బంగారు కుటుంబాలతోనే ఆర్థిక అభివృద్ధి

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**
సీఎం చంద్రబాబు చొరవతో బంగారు కుటుంబాలు ఎంపికతో పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి చెందుతారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం మండలంలో బంగారు కుటుంబలు ఎంపికలో భాగంగా మొబైల్ షాప్,తోపుడు బండ్లు, ఆటోమొబైల్స్, ఐరన్ షాప్ లను ప్రారంభించారు. పేదరిక నిర్మూలన ధ్యేయంగా మెగా ఇంజనీరింగ్ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందించి, దుకాణాలు ఏర్పాటు చేసుకొని ప్రోత్సహిస్తున్నారు. బంగారు కుటుంబాలు ఎంపికను దసలవారీగా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి ,ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి, గుర్రప్ప, విశ్వనాథ, రఫీ, రామకృష్ణప్ప, రఘు, అవినాష్, ఆదిల్, మంజునాథ్, నాగరాజు, అలివేలమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండి దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

## అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్న బీజేపీ అధ్యక్షులు పీవిఎన్ మాధవ్

**అరుణాచలం, ఫిబ్రవరి 9 :**
భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు లిపీవిఎన్ మాధవ్ అరుణాచలంలో పర్యటించారు. పంచభూత లింగాలలో ఒకటైన అగ్ని లింగాన్ని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 200 మంది బీజేపీ నాయకులతో కలిసి అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రానికి మంచి జరగాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం అరుణాచలంలోని లిరమణ మహర్షి ఆశ్రమాన్నిలి సందర్శించి, అక్కడి ఆశ్రమ ట్రస్టీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.
ఈ పర్యటనలో భాగంగా, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుండి అరుణాచలం వచ్చి నివసిస్తున్న లిసాధ్వి మాధవిలిని మాధవ్ కలిశారు. ఆమె రాసిన వివిధ ధార్మిక రచనల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా శైవక్షేత్రాల విశిష్టతపై ఆమె చేసిన రచనలను సాధ్వి మాధవి ఆయనకు వివరించారు.



తహసీల్దార్ చంద్రశేఖర్‌కు కరపత్రం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు తహసీల్దార్‌ని ఆహ్వానించిన కమిటీ సభ్యులు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

స్థానిక మారుతీ కాలోనిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మంగళవవారం నుంచి రెండు రోజులపాటు జరిగే శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సోమవారం రెవిన్యూ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ కు మహోత్సవానికి సంబందించిన కరపత్రాన్ని అందించి వేడుకలకు హాజరు కావాలని కోరారు. ప్రతిష్టాపన కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతారని హాజరవుతానని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

## హిందూ ధార్మిక మఠాలపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రయోగిస్తున్న చంద్రబాబు

*టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి*

**తిరుపతి (తెలుగోడు), ఫిబ్రవరి 9 :**

వేంకటేశ్వరస్వామి ప్రసాదం... లడ్డూలో జంతువుల కొవ్వు, గొడ్డు మాంసం కొవ్వు, పందికొవ్వు, చేపనూనె కలిశాయంటూ బాధ్యతా రాహిత్యమైన ప్రకటనలు చేసి, చివరకు అవి అసత్యాలని సీబీఐ-సిట్ దర్యాప్తులో స్పష్టం చేయడంతో ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితుల్లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తన అబద్ధాలను నిజం చేయడానికి, అవమానకర పరిస్థితుల నుంచి బయటపడానికి రోజుకో కుట్ర చేస్తున్నారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. ఏకంగా హిందూ ఆధ్యాత్మిక మఠాలపైనే తన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రయోగిస్తూ దేశ వ్యాప్తంగా తిరుమల క్షేత్రం పరువు, ప్రతిష్టను దెబ్బతీసే అపవిత్ర కార్యక్రమాలకు ఒడిగడుతున్నారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సీఎంఓలో ఓ అధికారిని ఈ ప్రత్యేక బాధ్యతలు అప్పగించగా, టీటీడీలో కొందరు అధికారులు వీరికి సహాయపడుతున్నారన్నారు. దక్షిణాది సహా దేశం లోని హిందూ ఆధ్యాత్మిక మఠాలకు వెళ్లడం, వారిని ఒత్తిళ్లకు గురిచేసి, అసత్యాలు చెప్పి తనకు అనుకూలంగా మఠాధిపతుల చేత లేఖలు విడుదల చేయించడం, వాటిని తమకు సంబంధించిన ఎల్లో మీడియాలో ప్రధాన శీర్షికల్లో ప్రచురించి, దుర్బుద్ధితో కూడిన ప్రచారానికి శ్రీకారం చుట్టారని ఆయన ఆరోపించారు. తిరుపతి లోని పెద్దజీయంగార్ మఠంపై ఇలాగే ఒత్తిడి తీసుకొచ్చి లేఖ విడుదల చేయించారన్నారు. కొన్ని రోజలుగా ఆయనపై ఒత్తిడి తీసుకొస్తున్నా నిరాకరించిన నేపథ్యంలో నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి, తన ప్రత్యేక కార్యదర్శి, టీటీడీ కొత్త ఈవో ముద్దాడ రవిచంద్రను పెద్ద జీయర్ వద్దకు పంపి, చంద్రబాబు గారు తనకు అనుకూలంగా లేఖ రాయించుకున్నారన్నారు. . వేయి సంవత్సరాల రామానుజాచార్యుల పరంపరనే భ్రష్టు పట్టించడానికి కూడా చంద్రబాబు నాయుడు గారు వెనుకాడలేదన్నారు.. ఈ కార్యక్రమాల కోసమే ముద్దాడ రవిచంద్రను టీటీడీ ఈవోగా చంద్రబాబు గారు నియమించుకున్నారన్నారు.

దేవుడ్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం, ఆ ఊబిలో తాను కూరుకుపోయిన నేపథ్యంలో మళ్లీ బయటపడ్డానికి మరొక కుట్ర చేయడం అత్యంత బాధాకరం అన్నారు. హిందూ ధర్మానికి, ఆధ్యాత్మిక ప్రపంచానికి చంద్రబాబు గారు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. వేల సంవత్సరాల ప్రతిష్ట ఉన్న తిరుమల ఆలయాన్ని రాజకీయాల కోసం దెబ్బతీయడం అత్యంత శోచనీయం అన్నారు. దేవుడంటే భయం, భక్తి ఉన్నవారు ఎవ్వరూ కూడా ఇలాంటి అపవిత్ర కార్యక్రమాలు చేయరన్నారు. శ్రీవారి భక్తులు, మఠాలపై చంద్రబాబు గారు తన రాజకీయ స్వార్థంతో చేస్తున్న దాడిగానే దీన్ని చూడాలని, ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. చంద్రబాబు కుట్రలను గమనించి, వాటిని తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు.



## నేడు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌ను కలవనున్న సీఎం చంద్రబాబు

**ఢిల్లీ, ఫిబ్రవరి 9:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం ఐదుగురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు కలవనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అవుతారు. కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌లతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, వివిధ పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చిస్తారు. భేటీల అనంతరం సాయంత్రం 5 గంటలకు అమరావతికి తిరుగుప్రయాణం అవుతారు.





# విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దు చేయాలి

### మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి.. సీపీఐ మండల కార్యదర్శి వి.వెంకటరాముడుయాదవ్ ..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**

విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సిపిఐ, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం, ఏపి మహిళా సమైక్య పిలుపుమేరకు పెద్దవడుగూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు సిపిఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ కష్టజీవుల జీవనానికి ఎంతో ఉపయోగపడే మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్యారంటీ పథకాన్ని నీరుగార్చాలనే ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం మోపే విధంగా విబిజీ-రామ్-జి పథకాన్ని రూపొందించిందన్నారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తే ఈ కొత్త పథకంలో 60 శాతం మాత్రమే ఇస్తోందన్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించే పరిస్థితి లేదన్నారు. గతంలో కూలీలకు గడార్లు, గంపలు, పారలు, తార్పాలిన్లు మెడికల్ కిట్లు, అందించేవారని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవన్నీ అటకెక్కాయన్నారు. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని కంకణం కట్టుకొని ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించుకుంటూ పేదల నోట్లో మట్టికొడుతోందన్నారు. పేదలపై క్రూరదాడి చేయడమే మోడీ ప్రభుత్వం ఎజెండా కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా కనువిప్పు కలిగి గతంలో వచ్చే నిధులు శాతాన్ని తగ్గించకుండా యధావిదంగా కొనసాగించాలని, 200 రోజులు పని దినాలను పెంచాలని, కూలి 700 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో ఏఐటియుసి మండల కార్యదర్శి ఉశేన్ పీరా, రంగనాయకులు, సుధాకరగౌడు, నాగేంద్ర, రామయ్య, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, నారాయణస్వామి, మల్లికార్జున, సుంకన్న, ఓబిరెడ్డి, వెంకటేష్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.




తహసిల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సిపిఐ రైతు సంఘం నాయకులు వెంకట్రాముడు యాదవ్

# బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ అవగాహన

### ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ్ కుమారి, శంషాద్ బేగం..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**

యాడికి మండలం కేంద్రంలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ్ కుమారి.శంషాద్ బేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ అవగాహన ర్యాలీకి ముఖ్య అతిథులుగా డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు మాట్లాడుతూ బాల్య వివాహరహిత ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే బాల్య వివాహ నిర్మూలనకు 100 రోజుల ప్రచార కార్యక్రమం చేపట్టిందన్నారు. ముఖ్యంగా బాల్యవివాహాలతో చాలా అనర్థాలు జరుగుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు అనంతరం ప్రజలు తో బాల్య వివాహల నిర్మూలలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో , డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లు విజయ్ కుమారి.శంషాద్ బేగం. సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




బాల్యవివాహాల నిర్మూలనపై నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ్ కుమారి, శంషాద్ బేగం

# కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు

### డీపీఎంఓ రామచంద్ర..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 9:**

యాడికి మండలం రాయల చెరువు గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలు, పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాయల చెరువు వైద్యులు అప్పయ్య . డిపిఎమ్ఓ రామచంద్ర మాట్లాడుతూ వివరిస్తూ స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు రాలిపోవటం, కాళ్ళకు చెప్పులు జారిపోవటం, చేతులతో వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవటం కుష్టు వ్యాధి లక్షణాలు అన్నారు. కుష్టువ్యాధి ఎలా సంక్రమిస్తుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలపై ప్రజలకు వివరిస్తూ పరీక్షించారు. అనంతరం అనుమానం ఉన్న వ్యక్తులను పరీక్షించి లెప్రెసి ఎం సి ఆర్ చెప్పులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. అప్పయ్య. డిపిఎమ్ఓ రామచంద్ర. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కుళ్లాయప్ప. ఏఎన్ఎం శివగంగా. ఆశ కార్యకర్తలు ఉపాధ్యాయులు. ప్రజలు. విద్యార్థులు పాల్గొనన్నారు.



నగరూరు గ్రామంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డిపిఎమ్ఓ రామచంద్ర



కుష్టువ్యాధి అనుమానం ఉన్న వ్యక్తులకు లేప్రసి ఎం సి ఆర్ చెప్పులు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య. డిపిఎమ్ఓ రామచంద్ర.

## మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం

**విజయవాడ, (తెలుగోడు), ఫిబ్రవరి 9:**

ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 40 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజులు పాటు హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. లో సోమవారం అసోసియేట్ ప్రోపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె -హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రోఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మ హ్మాద్ ఖాన్, సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు శిక్షణ తీసుకునే 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ముందుగా హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు.

మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ లో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో బేసిక్స్ ఆఫ్ హ్యాండ్ మేడ్ పేపర్ టెక్నాలజీ, కావాల్సిన ముడి పదార్థాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయటం జరిగింది. అలాగే ఫోటో ఫ్రేమ్ డిజైన్స్, మెటీరియల్ సెలక్షన్ గురించి, ఎల్.పోల్డర్ తయారీ పై, ఫైల్ తయారీ కోసం కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, ఫైల్స్ డిజైన్ ఎలా వుండాలి...హ్యాండ్ ఆన్ పోల్డర్ గురించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. స్వయం ఉపాధి నెలకొల్పుకునేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.



## పలుచోట్ల మైలేరు నిర్వహణ

**పలమనేరు (తెలుగోడు), ఫిబ్రవరి 9:**

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల మైలేరు ట్రెండ్ నడుస్తోంది. పలమనేరు మండలం కొలమాసనపల్లి గ్రామంలో కొన్ని రోజుల క్రితం మైలేరు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి ఎద్దులు ఈ క్రీడల పోటీల్లో పాల్గొన్నాయి. నిర్వాహకులు వాటికి ర్యాంకింగ్ ఇస్తూ కామెంట్రీ చేస్తూ విచ్చేసిన ప్రజలను ఉత్తేజ పరుస్తూ ఉన్న సందర్భంలో ఒక్కసారిగా ఎద్దు జనాల్లోకి దూసుకొచ్చింది. అందులో ఇద్దరు ఎద్దు కాళ్ళ కింద నలిగే పోయారు. అక్కడున్న స్థానికులు ప్రధమ చికిత్స చేసి వైద్యం కొరకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే వ్యక్తి మృతి చెందాడని వైద్యులు తెలిపారు, మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. జిల్లా స్థాయిలో ఎస్పీ, కింది స్థాయి అధికారులకు స్పష్టంగా ఆదేశాలిచ్చి ఉన్నారు ప్రజలకు ప్రాణాపాయం కలిగించే ఏ ఆటలైన కూడా అనుమతులు ఉండవు అని, కానీ కొంతమంది వీటిని పెడచెవిన పెడుతున్నారని కొలమాసనపల్లి ఘటన స్పష్టం అవుతోంది. ఈ ఘటనకు కొంతమంది అధికారులు స్థానిక నేతలు కారణం అనుకోవచ్చు అని ప్రజలువిమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా సంప్రదాయం అవసరమే అలా అని ప్రజలు అంటున్నారు.

# శ్రీశైలంలో అలరించిన కళారూపాలు













# మృణాల్ చుట్టూ పెళ్లి రూమర్లు



బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్‌తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది.

# 11న నెట్ ఫ్లిక్స్‌లోకి అనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.




# తెలుగు రాకున్నా మేనేజ్ చేస్తున్నా.. ప్రియాంక చోప్రా



రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్‌లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారం తో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్‌గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతున్నాను. సెట్‌లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్‌లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్‌లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్‌కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.



# అమ్మ సురేఖావాణికి మళ్లీ పెళ్లి చేయాలనుకున్న

అమరావతికి ఆహ్వానం మూవీలో సుప్రీత ఎంట్రీటాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో సుప్రీత మాట్లాడుతూ తన తల్లి సురేఖా వాణికి మళ్లీ పెళ్లి చేయాలనే ఆలోచన తనకు ఉందని వెల్లడించింది. 'రీసెంట్‌గా ఈ విషయం అమ్మతో చెప్పాను. కానీ ఆమె మాత్రం నాన్న జ్ఞాపకాలతోనే జీవించాలనుకుంటోంది. ఆ ప్లేస్‌లోకి వేరే ఎవరినీ రానివ్వకూడదని భావిస్తోంది. అదే సమాధానం నాకు చెప్పిందని సుప్రీత తెలిపింది. అయితే తాను పెళ్లి చేసుకునేలోపు అయినా అమ్మకు మంచి జీవిత భాగస్వామి దొరికితే బాగుంటుందని కోరుకుంటున్నానని చెప్పింది. సురేఖా వాణి కెరీర్ గురించి కూడా సుప్రీత మాట్లాడింది. ఒకప్పుడు తన తల్లి ఎంతో బిజీ ఆర్టిస్ట్ అని, ఇప్పుడు మాత్రం అవకాశాలు తగ్గిపోయాయని పేర్కొంది. మేకప్ వేసుకుని ఏడాదిన్నర దాటిపోయింది. సినిమాల్లో నటించాలని అమ్మకు ఇంకా ఆసక్తి ఉంది. కానీ అవకాశాలు రావడం లేదు అని ఫీల్ అవుతోంది. కనీసం ఒక మంచి పాత్ర వచ్చినా చేయాలని ఉందని చెబుతోంది అని తెలిపింది. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇక సుప్రీత హీరోయిన్‌గా పరిచయం అవుతున్న 'అమరావతికి ఆహ్వానం' చిత్రం హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కింది.

# 14న పెద్ది సెకెండ్ సింగిల్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' పై ప్రేక్షకుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' మ్యూజిక్ లవర్స్‌ను విపరీతంగా ఆకట్టుకుని ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు అందరి దృష్టి సినిమా నుంచి రాబోతున్న సెకండ్ సింగిల్ పై పడింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రెండో పాట ఒక పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్ గా ఉండనుందని తెలుస్తోంది. రామ్ చరణ్ పాత్రను గ్రాండ్‌గా ఎలివేట్ చేసే ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సాంగ్‌లో చరణ్ మాస్ ఎనర్జీ, స్టైల్ అభిమానులను అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ పాట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సాంగ్ ఖచ్చితంగా ఒక బ్లాస్ట్ లా ఉంటుంది' అంటూ అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. వాస్తవానికి ఈ పాటను డిసెంబర్ చివర్లో విడుదల చేయాలనుకున్నప్పటికీ, పలు కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటన ఈ వారంలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అదేవిధంగా కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, యాక్షన్, సంగీతం మేళవింపుతో ఉండబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30 న ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సాంగ్‌తోనే సినిమాపై భారీ హైప్ ఏర్పడగా, రాబోయే సెకండ్ సింగిల్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.